E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 22-08-2025 (వారం) శుక్రవారం హైదరాబాద్ e-kaburu.com



31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్
» 3లో

## కేంద్ర, రాష్ట్రాల మధ్య చిచ్చు.. అసలేంటీ "ఎరువుల" వివాదం?



**ఈ కబురు : కేంద్ర, రాష్ట్రాల మధ్య చిచ్చురేపిన ఎరువుల కొరత గొడవకు అసలు కారణం తెలుసుకుందాం. భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. భారత్ లో వ్యవసాయం ఎక్కువగా వర్షా లపై ఆధారపడి ఉంటుంది. మే చివరి వారం లేదా జూన్ మొదటి వారంలో దేశంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో రైతులు వ్యవసాయ పనులు మొదలు పెడతారు. మనదేశంలో పండే పంటల్లో ముఖ్యమైనవి వరి, గోధుమ, పత్తి, మిర్చి, మొక్కజొన్న, సోయాబీన్, చెరుకు వంటి పంటలు పండిస్తారు. అయితే ఆయా పంటలకు నీరు ఎంత ముఖ్య అవసరమో ఎరువులు కూడా అంతే అవసరం. పంటలు బాగా పెరగడానికి, చీడ పీడలను తట్టుకునేందుకు యూరియా, (డై అమోనియం ఫాస్ఫేట్), (మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వంటి ఎరువులను వాడతారు.**

అయితే ప్రస్తుతం దేశంలో ఎక్కడ చూసినా ఎరువుల కొరత వేధిస్తోంది. పంటలు మొదలు పెట్టాక అవసరం అయిన ఎరువుల కోసం రైతులు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల గొడవలు కూడా జరుగుతుండగా.. మరికొన్ని చోట్ల వానలు సైతం లెక్క చేయకుండా లైన్లో నిలబడుతున్నారు. ఇంకోచోట ముందురోజు రాత్రే వచ్చి లైన్లోనే నిద్రపోతున్నారు. అయితే ఎందుకు ఈ ఎరువుల కొరత వస్తోంది? అసలు ఎరువులు పంపిణీ చేసే బాధ్యత ఏమిటీ? అన్ని రాష్ట్రాలకు ఎరువులు ఎక్కడి నుంచి వస్తాయి? ఏ ప్రాతిపదికన ఎరువుల పంపిణీ జరుగుతుంది? తెలంగాణలో ఇంతగా ఎరువుల కొరత ఎందుకువచ్చింది అనే విషయాలు తెల్సుకుందాం.

తరువాయి 2లో

## భారత్ చైనా కరుగుతున్న మంచు

ఈ కబురు:ఫిబ్రవరి 2014లో చైనా అధ్యక్షుడు క్సి జిన్పింగ్ మళ్ళీ క్రీ.పూ. నాటి 'సిల్క్ రూట్'ను పునరుద్ధరిస్తున్నాం, అని ప్రకటించినప్పుడు చైనాకు అదొక అత్యాశతో కూడిన కల అని ప్రపంచం అనుకుంది. ప్రపంచం అలా అనుకుని వుండొచ్చు, కానీ సరిహద్దున ఉన్న మనమూ అలాగే అనుకుని సరిపెట్టేసుకున్నాం. అప్పటికి ఒబామా రెండవసారి అధ్యక్షుడు



» 3లో

## ఇండీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి నామినేషన్


*ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ వేశారు. గురువారం ఉదయం 11.30 గంటలకు రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోడీకి తన నామినేషన్‌పత్రాలు సమర్పించారు.*

» 2లో



## కాళేశ్వరం కమిషన్' నివేదిక పరిస్థితి ఏమిటి?

» అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తర్వాత చర్యలా?
» చర్యలు తీసుకున్న తర్వాత అసెంబ్లీలోనా?
» హైకోర్టు ప్రశ్న..నేడు వెల్లడిస్తానన్న ఏజీ
» నీటిపారుదల గౌరవ సలహాదారుగా రిటైర్డ్
» లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్ సింగ్



తరువాయి 2లో

హైదరాబాద్,ఈ కబురు: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక పరిస్థితి ఏంటని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. "నివేదికను అసెంబ్లీలో పెట్టడానికి ముందే చర్యలు తీసుకుంటారా? అసెంబ్లీలో చర్చించిన తర్వాత తీసుకుంటా రా? కమిషన్ నివేదికపై ఏంచేశారన్న వివరాలు కూ డా ఉండాలి కదా? వాటిని కూడా అసెంబ్లీలో పెడతారా? కమిషన్ నివేదిక ఇచ్చిన 6 నెలల్లో చర్యలు తీసుకోవాలని చట్టంలో ఉంది" అని పేర్కొంది. తమకు అత్యవసరం ఉందని.. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్లు పేర్కొంటున్న నేపథ్యంలో ఈ సమాచారం తమకు కీలకమని చీఫ్‌జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి సమాధానమిస్తూ.. తన వద్ద సమాచారం లేదని, శుక్రవారం తెలియజేస్తానన్నారు.

కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు..

కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను కొట్టేయాలని విజ్ఞప్తి చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లపై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. కేసీఆర్, హరీశ్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామ శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. "కాళేశ్వరం కమిషన్ నివేదికను అడ్డంపెట్టుకుని మా ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యతిరేక ప్రచారం చేయాలని చూస్తున్నారు. నివేదిక కాపీ మాకు ఇవ్వకుండానే దానిపై సీఎం, మంత్రులు మీడి యా సమావేశం నిర్వహించడంతోపాటు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నివేదికను అదేరోజు మీడియా మొత్తానికి ఇచ్చేశారు. పత్రికల్లో పూర్తివివరాలు బహిర్గతమవడంతోపాటు దాదాపు 100 వెబ్‌సైట్లలో సమాచారం ఉంది. మేం కూడా ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచే డౌన్‌లోడ్ చేసుకున్నాం. ప్రత్యేక రాష్ట్రం కోసం నా ప్రాణాలు పణం గా పెట్టాను. రాజకీయ నేతలకు పేరు ప్రఖ్యాతులు, కీర్తి ప్రతిష్ఠలు ముఖ్యం.

విరాట్ నుంచి ఆ రెండు రికార్డులకు ముప్పు తప్పినట్లే..!
» 6లో



చిరంజీవి 'విశ్వంభర' గ్లింప్స్ రిలీజ్.. ఖుషీలో ఫ్యాన్స్
» 5లో



ఈపీఎఫ్‌వో 'కొత్త' రికార్డ్..
» 4లో

EPFO

## సిద్ధాంతాల్లో రాజీ లేదు



**టీవీకే అధ్యక్షుడు విజయ్ మదురైలోమహానాడుకు భారీగా తరలివచ్చిన ప్రజలు ప్రసంగిస్తున్న విజయ్**

ప్యారిస్, ఈ కబురు: వచ్చిన గుంపు ఓటుగా మారుతుందా అని పలువురు విమర్శించారని, ఈ గుంపు ఓటు కోసం మాత్రమే కాదని పాలకులను వేటాడేందుకు కూడా అని తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు విజయ్ తెలిపారు. పార్టీ రెండో మహానాడు మదురై జిల్లా పారపత్తిలో గురువారం ఘనంగా జరిగింది. ఆయన ప్రసంగిస్తూ సింహానికి ఒంటరిగా, గుంపుతోనూ ఉండడం తెలుసన్నారు. అది ఒంటరిగా వస్తే అన్నింటికీ నీళ్లు తాగిస్తుందన్నారు. అడవికి సరిహద్దులు నియమించి తన ఆధీనంలో ఉంచుకునే సింహం అంత త్వరగా ఎవరినీ తాకదని, తాకితే వదిలి పెట్టదని రాజకీయ పార్టీలను ఉద్దేశించి తెలిపారు. మదురై అంటే వీరత్వం, అలంగా నల్లూర్ జల్లికట్టు జ్ఞాపకం వస్తాయన్నారు. పురట్చి తలైవర్ ఎంజీఆర్ కూడా మదిలో మెదులుతారన్నారు. ఆయనతో మాట్లాడే అవకాశం తనకు లభించలేదని, ఆయనలాంటి మనసున్న సోదరుడు, పురట్చి కలైజ్ఞర్, కెప్టెన్ విజయకాంత్‌తో మాట్లాడగలిగానన్నారు.

రాబోయే ఎన్నికల్లో రాజకీయ మార్పు..

2026లో రాజకీయ మార్పు వస్తుందని విజయ్ తెలిపారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, రైతులు, కార్మికుల కలయికగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో టీవీకే, డీఎంకే మధ్యే పోటీ అన్నారు. రాజకీయ లబ్ధికి పార్టీని ప్రారంభించలేదని, సిద్ధాంతాల విషయంలో ఎప్పటికీ రాజీ పడలేదన్నారు. మనది ఆత్మగౌరవ కూటమిగా ఉండాలని తెలిపారు. ఒకవైపు ఆర్ఎస్ఎస్‌కి బానిసగా ఉంటూ మరోవైపు లౌకిక కూటమి అని మోసం చేసేలా ఉండదన్నారు. ప్రజల ప్రేమ, ఆశీర్వాదం ఉండగా భాజపాతో పరోక్ష, ప్రత్యక్ష కూటమి ఎందుకన్నారు. నమ్మి వచ్చే వారికి పాలనలో, అధికారంలో భాగస్వామ్యం ఇవ్వాలన్నారు. 'ఎదిర్‌కాలం వరుం, ఎన్ కడమై వరుం' అని ఎంజీఆర్ పాడిన పాటను ఆలపించారు. స్టాలిన్ అంకుల్..

తరువాయి 2లో



## మూసీ ప్రక్షాళన పేరుతో దోపిడీ

**ఈ కబురు, హైదరాబాద్: మూసీ సుందరీకరణ, ప్రక్షాళన పేరుతో ప్రజల సొమ్మును కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకోవడానికి సిద్ధమవుతోందని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్**

» 2లో


## గతంలో తెలుగువారికి మద్దతిచ్చారా?

» ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్న
» ఇప్పటికే 20 లక్షల టన్నులు సరఫరా చేసినట్లు వెల్లడి
» మరో 2 లక్షల టన్నులు రాబోతున్నట్లు స్పష్టీకరణ



ఈ కబురు, దిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల తరఫున పోటీ చేస్తున్న తెలుగు వ్యక్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి తెలుగు రాష్ట్రాల్లోని ఎంపీలు మద్దతివ్వాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఇదివరకు తెలుగువారైన వెంకయ్యనాయుడుకు మద్దతివ్వాలని రేవంత్‌రెడ్డి ఇలాగే పిలుపునిచ్చారా? లోక్‌సభ స్పీకర్‌గా తెలుగు వ్యక్తి జీఎంసీ బాలయోగిని పెట్టినప్పుడు కాంగ్రెస్ మద్దతు పలికిందా?' అని నిలదీశారు. కిషన్‌రెడ్డి గురువారం దిల్లీలో విలేకరులతో మాట్లాడారు. యూరియా ఇచ్చిన వారికి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతిస్తామని కేటీఆర్ చేసిన ప్రకటనను విలేకరులు ప్రస్తావించగా కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఆయన మద్దతు ఎవరు కోరారు? మాకు వారి మద్దతే అవసరం లేదు. రైతులకు యూరియా సరఫరా చేస్తున్నది కేంద్రమే తప్ప.. రాహుల్‌గాంధీ కానీ, రేవంత్‌రెడ్డి కానీ బయటి నుంచి తేవడం లేదు' అని ఎద్దేవా చేశారు. ఎన్డీయే అభ్యర్థికి మద్దతివ్వాలని అన్ని పార్టీలను కోరుతున్నప్పుడు భారాసను ఎందుకు అడగడం లేదు? అని విలేకరులు అడిగిన మరో ప్రశ్నకు స్పందిస్తూ.. 'అడుగుతాం.. కానీ యూరియా ఇస్తేనే మద్దతిస్తామనడం బాగాలేదు. ఇది చిన్నపిల్లలాటలా ఉండకూడదు' అని అన్నారు.

తరువాయి 2లో




ఒలింపిక్స్ కోసం బిడ్ వేయండి.. సహకరిస్తాం: భారత్‌కు ఆస్ట్రేలియా మద్దతు
» 6లో

ఈ-కబురు
22- 08 -2025
శుక్రవారం
e-kaburu.com

మొదటి పేజీ తరువాయి

# కాళేశ్వరం కమిషన్' నివేదిక పరిస్థితి ఏమిటి?



వాటిపై దాడి చేసి, చెడుగా చిత్రీకరించేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు కూడా నివేదికను అసెంబ్లీలో పెట్టి, విమర్శలు చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఒక వ్యక్తి ప్రతిష్ఠ దెబ్బతినే విధంగా నివేదిక ఇవ్వాల్సి వస్తే కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 8బీ, 8సీ ప్రకారం నోటీసులిచ్చి.. సదరు వ్యక్తికి వాదనలు వినిపించుకునే అవకాశమివ్వడంతోపాటు సాక్షులను క్రాస్ఎగ్జామినేషన్ చేసే అవకాశమివ్వాలి. ప్ర స్తుత కేసులో మమ్మల్ని సాక్షులుగా పిలిచి.. పూర్తి బాధ్యత మాదే అన్నట్లు నివేదిక ఇచ్చారు. కమిషన్ నివేదికలో మాకు వ్యతిరేకంగా ఉన్న విషయాలకు.. మమ్మల్ని అడిగిన వాటికి పొంతనే లేదు. ఎవరో ఇచ్చిన తప్పుడు సాక్ష్యాలకు మా వాదన వినకుండా మమ్మల్ని ఎలా బాధ్యులను చేస్తారు? అలాంటి నివేదిక న్యాయసమీక్షకు నిలవదు. ఇందుకు సుప్రీంకోర్టు ఇచ్చిన 'లాల్‌కృష్ణ అద్వాణీ', 'కిరణ్‌బేడీ', ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన 'విజయభాస్కర్‌రెడ్డి' తీర్పులే ఉదాహరణ. ఆ నివేదికను కొట్టేయకపోతే మాకు తీవ్ర నష్టం జరుగుతుంది. నివేదికను అసెంబ్లీలో పెట్టకముందే మధ్యంతర ఉత్తర్వులివ్వాలి'' అని పేర్కొన్నారు.

పిటిషనర్లకు ఇచ్చింది 8బీ నోటీసులే

రాష్ట్ర ప్రభుత్వం, కాళేశ్వరం కమిషన్ తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు కొనసాగించారు. ''కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదికకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. నివేదికను అసెంబ్లీ ముందుంచి, దానిపై పూర్తిస్థాయిలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అప్పటివరకు కమిషన్ నివేదికను బయటపెట్టబోం. కమిషన్ నివేదిక 650 పేజీలు ఉన్నందున.. క్యాబినెట్‌కు సహాయం చేయడానికి ముగ్గురు అధికారులతో కమిటీ వేసి, దానిపై 60 పేజీల సంక్షిప్త నివేదిక తయారు చేశారు. అంతేతప్ప కమిషన్ నివేదికను బయటపెట్టలేదు. నివేదిక కాపీ ఇవ్వలేదని ఆరోపిస్తున్న పిటిషనర్లు ఇద్దరూ ఎమ్మెల్యేలే. వారిద్దరూ అసెంబ్లీకి వచ్చి పూర్తిస్థాయిలో చర్చించవచ్చు. పిటిషనర్లకు ఇచ్చింది సమన్లు కాదు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 8బీ నోటీసులే. అది కేసీఆర్, హరీశ్‌కూ స్పష్టంగా తెలుసు. అందుకే అన్ని పత్రాలు అడిగారు. ఏయే పత్రాలు రికార్డుల్లోకి తీసుకోవాలో చెప్పారు. వారు పేర్కొన్న గత తీర్పులు ప్రస్తుత సందర్భానికి వర్తించవు. కమిషన్ నివేదిక అడ్వైజరీ లక్షణం కలిగి ఉండి మార్గదర్శనం చేస్తుంది. దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారే తప్ప ఇప్పటికిప్పుడు ఏదో అవుతుందని తొందర అవసరం లేదు'' అని తెలిపారు.

నివేదిక ఎక్కడి నుంచి వచ్చింది?

వాదనల సందర్భంగా నివేదికలోని వివరాలు ఎక్కడి నుంచి వచ్చాయని కోర్టు ప్రశ్నించింది. పిటిషనర్ల న్యాయవాదులు సమాధానమిస్తూ.. ఈనెల 4న సర్కా రు మీడియా సమావేశం నిర్వహించి, విలేకరులకు నివేదిక ఇచ్చిందని తెలిపారు. తాము కూడా ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచే డౌన్‌లోడ్ చేసుకున్నామని, కావాలంటే ఆన్‌లైన్‌లో చూడవచ్చన్నారు. ఏజీ వాదిస్తూ.. నివేదికను బయటపెట్టలేదని, అవి అధికారులు తయారుచేసిన సమ్మరీ అని పేర్కొన్నారు. నివేదికను నేరుగా అసెంబ్లీకి సమర్పిస్తామన్నారు. మరోవైపు పిటిషనర్లు సమర్పించిన కాపీల్లో స్పష్టత లేదని, కొన్ని పేజీలు కనిపించడం లేదని కోర్టు అసహనం వ్యక్తం చేసింది. స్పష్టంగా ఉండేలా కాపీలు ఇవ్వాలని ఆదేశిస్తూ.. విచారణను శుక్రవారానికి వాయిదావేసింది.

మొదటి పేజీ తరువాయి

# మూసీ ప్రక్షాళన పేరుతో దోపిడీ



ఈ కబురు, హైదరాబాద్: మూసీ సుందరీకరణ, ప్రక్షాళన పేరుతో ప్రజల సొమ్మును కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకోవడానికి సిద్ధమవుతోందని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం మూసీ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలను భారీగా పెంచి దోపిడీకి తెరలేపిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. "మూసీ నదిలో చేరే 2 వేల ఎంఎల్‌డీ మురుగు నీటిని శుద్ధి చేయడం కోసం భారాస ప్రభుత్వం 36 ఎస్టీపీల నిర్మాణం చేపట్టి పూర్తిచేసింది. మూసీ అభివృద్ధి కోసం రూ.16వేల కోట్లతో మాస్టర్‌ప్లాన్, డీపీఆర్ తయారు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అంచనాలను రూ.1.5 లక్షల కోట్లకు పెంచింది. ఒకవైపు కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని అబద్ధాలు చెబుతూ.. మరోవైపు ఈ ప్రాజెక్టులో అంతర్భాగమైన కొండపోచమ్మసాగర్ నుంచి గోదావరి నీటిని తీసుకుంటామని చెప్పడాన్ని ప్రజలు గమనిస్తున్నారు" అని కేటీఆర్ పేర్కొన్నారు.'



మొదటి పేజీ తరువాయి

# కేంద్ర, రాష్ట్రాల మధ్య చిచ్చు.. అసలేంటీ "ఎరువుల" వివాదం?



మనదేశంలో రైతులకు ఎరువులు పంపిణీ చేసే బాధ్యత ప్రధానంగా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, దాని అనుబంధ సంస్థలైన ఎరువుల శాఖ ది. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాలు, సహకార సంఘాలు, ఎరువుల తయారీ సంస్థలు, పంపిణీదారులది కూడా కీలక పాత్ర. *ఎరువుల ఉత్పత్తి, దిగుమతి, సరఫరా, సబ్సిడీలు వంటి చర్యలన్నీ కేంద్ర ప్రభుత్వం చూసుకుంటుంది. ఎరువుల్లో ముఖ్యంగా యూరియా, (డ్రై అమోనియం ఫాస్ఫేట్), (మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వంటి ప్రధాన ఎరువుల సరఫరా కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉంటుంది .*రాష్ట్ర స్థాయిలో ఇక రాష్ట్రంలో ఎరువుల పంపిణీని సమన్వయం చేసుకోవడం, రైతుల అవసరాలను అంచనా వేసి కేంద్రానికి నివేదికలు పంపడం వంటి పనులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. *గ్రామీణ స్థాయిలో రైతులకు ఎరువులను అందజేసేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, లైసెన్స్ పొందిన డీలర్లు బాధ్యత వహిస్తాయి.అయితే 2018 నుండి, ఎరువుల సబ్సిడీలు DBT వ్యవస్థ ద్వారా రైతులకు నేరుగా బదిలీ చేయబడుతున్నాయి. DBT ద్వారా రైతులు సబ్సిడీ రేట్లతో ఎరువులను కొనుగోలు చేయగా.. డీలర్లకు సబ్సిడీ మొత్తం తిరిగి చెల్లించబడుతుంది.

రాష్ట్రాలకు వాటా ఎలా నిర్ధారిస్తారు?

మనదేశంలో రాష్ట్రాలకు ఎరువుల వాటా ఖచ్చితమైన శాతం గాని నిర్దిష్ట పరిమాణంగా గాని ఏదీ లేదు. కానీ రాష్ట్రాల వ్యవసాయ అవసరాలు, సాగు విస్తీర్ణం, పంటల రకాలు, రైతుల డిమాండ్ ఆధారంగా రాష్ట్రాల వాటాను నిర్ధారిస్తారు. ప్రతిఏటా ఈ వాటా శాతం మారుతూ ఉండవచ్చు. ప్రధాన ఎరువులైన యూరియా, DAP, MOP వంటి వాటా ఆయా రాష్ట్రంలో సాగు చేయబడే భూమి విస్తీర్ణం, సాగు విస్తీర్ణం ఆధారంగా అంచనా వేస్తారు. ఉదాహరణకు, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు అధిక వ్యవసాయ ఉత్పాదకత కలిగిన రాష్ట్రాలు ఎక్కువ ఎరువుల వాటాను పొందుతాయి. పంటలను బట్టి కూడా ఎరువుల వాటా మారుతుంది. వరి, గోధుమ, నూనె గింజలు, చెరకు, బంగాళదుంప వంటి పంటలకు అవసరమైన ఎరువుల వాటాలు వేర్వేరుగా ఉంటాయి. ఉదాహరణకు వరి సాగు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్) యూరియా ఎక్కువగా అవసరమవుతుంది. అలాగే సీజనల్ డిమాండ్ ను బట్టి కూడా వాటా ఉంటుంది. ఖరీఫ్ (జూన్‌సెప్టెంబర్), రబీ (అక్టోబర్‌మార్చి) సీజన్లలో ఎరువుల డిమాండ్ మారుతుంది కాబట్టి ఎరువుల వాటా కూడా మారుతుంది. అన్ని రాష్ట్రాలు తమ సీజనల్ అవసరాలను కేంద్రానికి ముందే నివేదిస్తాయి.202324డేటా ప్రకారం...కేంద్ర ఎరువుల శాఖ నివేదికల ప్రకారం, భారతదేశంలో వార్షిక ఎరువుల వినియోగం సుమారు 60 మిలియన్ టన్నులు. దీనిలో ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలు అత్యధిక వాటాను (సుమారు 4050% కలిపి) కలిగి ఉన్నాయి. అయితే దేశంలో అత్యధిక ఎరువుల వాటా పొందే రాష్ట్రం ఉత్తరప్రదేశ్. ఇది ఒక్కటే సుమారు 12 15 మిలియన్ టన్నుల ఎరువులను వినియోగిస్తుంది. ఎందుకంటే ఇది అతిపెద్ద వ్యవసాయ రాష్ట్రం కాబట్టి. ఈశాన్య రాష్ట్రాలు, కొన్ని కేంద్రపాలిత ప్రాంతాలు తక్కువ వాటాను (సుమారు 510%) పొందడానికి గల కారణం వాటి వ్యవసాయ విస్తీర్ణం తక్కువ ఉండటం. మొత్తానికి రాష్ట్రాల నుంచి వచ్చిన ఎరువుల అవసరాల అంచనాల నివేదికను ముఖ్య ప్రయారిటీగా పరిగణిస్తుంది కేంద్రం. పంటల సాగు విస్తీర్ణం, పంటల రకాలు, నీటిపారుదల సౌకర్యాలు, గత సంవత్సరాల ఎరువుల వినియోగ డేటా ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు అంచనాలు రూపొందించి, కేంద్రానికి పంపిస్తాయి. ఇలా రాష్ట్రాల నుంచి వచ్చిన డిమాండ్ ను దృష్టిలో పెట్టుకొని, తమవద్ద ఉన్న నిల్వలు, దిగుమతులను సరిచేసుకొని ఎరువుల వాటాలను కేంద్రం నిర్ధారిస్తుంది.

ఎరువుల కొరతకు కారణాలివే :

దేశంలో వస్తున్న పంటల ఆధునిక టెక్నాలజీ, నీటి పారుదల లభ్యత పెరగడం, హైబ్రిడ్ విత్తనాల వాడకం భారీగా పెరగడం వల్ల ఏడాదికి రెండు నుంచి మూడు పంటలు పండించే స్థితికి దేశ వ్యవసాయం అభివృద్ధి చెందింది. అయితే పంటలు ఎక్కువయ్యే కొద్దీ ఎరువుల వాడకం కూడా భారీగా పెరుగుతోంది. దీంతో ఎరువుల ఉత్పత్తికి, వాడకానికి భారీ అంతరాయం ఏర్పడి కొరతకు దారి తీస్తోంది. అలాగే రైతులకు ఎరువుల వాడకం పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్ల అవసరం అయిన దానికంటే ఎక్కువ ఎరువులు వాడటం వల్ల కూడా ఎరువుల కొరతకు కారణం అవుతోంది. ఇక మరికొన్ని చోట్ల బ్లాక్ మార్కెట్ వల్ల కూడా కృత్రిమ కొరత ఎదురవుతోంది.అంతేకాదు సేంద్రీయ ఎరువుల వాడకం కంటే రసాయన ఎరువుల వైపు రైతులు మొగ్గు చూపడం కూడా ఒక కారణమే.

తెలంగాణలో ఎందుకు కొరత :

అన్ని పెద్దరాష్ట్రాల మాదిరిగానే తెలంగాణ కూడా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. రాష్ట్రంలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, మిరప, పసుపు వంటి పంటలు పండిస్తారు. ఈ పంటలకు యూరియా, DAP, మరియు MOP వంటి ఎరువుల అవసరం ఎక్కువగా ఉంటుంది కాబట్టి డిమాండ్ కూడా ఎక్కువే. రాష్ట్రానికి కావాల్సిన ఎరువుల వాటా వ్యవసాయ సాగు విస్తీర్ణం, పంటల రకాలు, సీజనల్ డిమాండ్ ఆధారంగా నిర్ణయించి కేంద్రానికి నివేదిక పంపిస్తుంది ప్రభుత్వం. తెలంగాణలో ఏడాదికి సుమారు 1012 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతున్నట్టు డేటా వివరాలు చెబుతున్నాయి. ఇందులో యూరియా సుమారు 60 65% ఉండగా DAP 2025%, మిగిలింది MOP తోపాటు ఇతర సంక్లిష్ట ఎరువులు వినియోగించబడుతున్నాయి. అలాగే సీజనల్ కేటాయింపుల ప్రకారం.. ఖరీఫ్ సీజన్ (జూన్‌సెప్టెంబర్)లో ఎరువుల డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఈ సీజన్లో వరి, పత్తి సాగు ఎక్కువగా జరుగుతుంది. రబీ సీజన్ (అక్టోబర్‌మార్చి)లో మొక్కజొన్న ఇతర పంటలకు కూడా ఎరువులు అవసరమవుతాయి.అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కోసం కేంద్ర ప్రభుత్వం 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించగా.. ఏప్రిల్‌ఆగస్టు వరకు 8.3 లక్షల టన్నులు సరఫరా చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు 5.32 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేయగా.. మరో 2.98 లక్షల టన్నులు సరఫరా చేయాల్సి ఉంది. దీంతో రాష్ట్రంలో అనేక చోట్ల ఎరువుల కొరతతో రైతన్నలు రోడ్డెక్కుతున్నారు. ఎరువులు పంపిణీ చేసే సహకార సంఘాల ముందు, డీలర్ల ఔట్‌లెట్స్ ముందు గంటలకొద్దీ బారులు తీరుతున్నారు. కొన్నిచోట్ల వర్షాలను సైతం లెక్కచేయకుండా లైన్లలో నిలబడుతుండగా.. మరికొన్నిచోట్ల ముందురోజే వచ్చి లైన్లలో నిద్రపోతున్నారు.అయితే ఈ ఎరువుల కొరత ప్రస్తుతం రాష్ట్రంలో పొలిటికల్ టర్న్ తీసుకుంది. ప్రభుత్వం సరిగా సమన్వయం చేయకపోవడం వల్లే ఈ కొరత అని, డీలర్లు కావాలని సరుకును బ్లాక్ మార్కెట్ కు తరలిస్తుంటే అడ్డుకోలేకపోయారని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నాయి. గత ప్రభుత్వం ముందుచూపుతో కేవలం కేంద్రం మీదనే ఆధారపడకుండా ఇతర రాష్ట్రాల వద్ద మిగిలిన ఎరువులను కూడా సేకరించి సకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు ఎరువులు అందజేశామని, ప్రస్తుత ప్రభుత్వానికి ముందు చూపు లేదని, అందువల్లే ఎరువుల తీవ్ర కొరత ఏర్పడిందని విమర్శలు చేస్తున్నాయి. ఎరువులను సమయానికి కోరినంత మేరకు కేంద్రం పంపిణీ చేయడకపోవడం వల్లే ఈ సమస్యలని ప్రభుత్వం చెబుతోంది. కాంగ్రెస్ పాలిత ప్రాంతాలపై కావాలనే ఈ చిన్నచూపు చూస్తూ, రాష్ట్రం ముందు దోషుల్ని చేయాలని బీజేపీ కేంద్ర ప్రభుత్వం చూస్తోందని కూడా ఆరోపణలు చేస్తోంది.ఏది ఏమైనా పంటలు మొదలు పెట్టి ఎరువుల కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తున్న అన్నదాతలను ఆదుకోవడం కేంద్ర, రాష్ట్రాల పూర్తి బాధ్యత. ఈ దేశంలో రైతు బాగుంటేనే దేశబాగు అని గుర్తించి, కావాల్సిన ఎరువులు త్వరగా సరఫరా చేయాలని ప్రభుత్వాలను కోరుకుంటున్నారు సామాన్య ప్రజలు.

# గతంలో తెలుగువారికి మద్దతిచ్చారా?

. 'ఆయన మద్దతు ఎవరు కోరారు? మాకు వారి మద్దతే అవసరం లేదు. రైతులకు యూరియా సరఫరా చేస్తున్నది కేంద్రమే తప్ప.. రాహుల్‌గాంధీ కానీ, రేవంత్‌రెడ్డి కానీ బయటి నుంచి తేవడం లేదు' అని ఎద్దేవా చేశారు. ఎన్డీయే అభ్యర్థికి మద్దతివ్వాలని అన్ని పార్టీలను కోరుతున్నప్పుడు భారాసను ఎందుకు అడగడం లేదు? అని విలేకరులు అడిగిన మరో ప్రశ్నకు స్పందిస్తూ.. 'అడుగుతాం.. కానీ యూరియా ఇస్తేనే మద్దతిస్తామనడం బాగాలేదు. ఇది చిన్నపిల్లలాటలా ఉండకూడదు' అని అన్నారు.అడ్డగోలు మాటల వల్లే యూరియా సమస్య: 'రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ కాంగ్రెస్ మంత్రులు రోజూ అడ్డగోలుగా మాట్లాడటం వల్లే.. కొందరు వ్యాపారులు అక్రమంగా నిల్వ చేస్తున్నారు. మరికొందరు దారి మళ్లిస్తున్నారు. అంతర్జాతీయంగా ఉన్న యుద్ధ వాతావరణం వల్ల కొంత సమస్య తలెత్తిన మాట వాస్తవమైనా..కేంద్రం రాష్ట్రానికి అవసరమైనంత యూరియా సరఫరా చేసింది. ఈ ఏడాది 20 లక్షల టన్నుల యూరియా అవసరం కాగా, గత ఏడాది మిగిలిన నిల్వలు, ఈ ఏడాది కొత్తగా పంపింది కలుపుకొని తెలంగాణకు ఇప్పటికే 20 లక్షల టన్నులు అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు మరో 2 లక్షల టన్నులు రాబోతోంది. కరైకల్ పోర్టు నుంచి 10 వేల టన్నులు తెలంగాణకు ఇవ్వాలని కేంద్రమంత్రి జేపీ నడ్డా ఆదేశించారు. ఇఫ్‌కో నుంచి 15 వేలు, క్రిభ్‌కో నుంచి 17500, ఆర్‌సీఎఫ్ నుంచి 7500, మంగళూరు ఫెర్టిలైజర్స్ నుంచి 2,500 టన్నుల యూరియా రాష్ట్రానికి రానుంది. విశాఖపట్నం, గంగవరం పోర్టులకు వచ్చే 35 వేల టన్నుల్లోనూ రాష్ట్రానికి వాటా వస్తుంది. మొత్తంగా 50 వేల టన్నులు రవాణాలో ఉంది. గతంలో మూతపడిన రామగుండం సహా 5 ఎరువుల కర్మాగారాలను మోదీ తెరిపించారు. సౌదీ అరేబియాలో పెడుతున్న యూరియా ఫ్యాక్టరీలో కూడా కేంద్రం పెట్టుబడి పెట్టి.. మన వాటా ఖరారు చేసుకుంటోంది' అని కిషన్‌రెడ్డి వివరించారు. తీవ్ర నేరారోపణలపై అరెస్టయి 30 రోజులకు మించి జైల్లో ఉన్నవారిని పదవీచ్యుతులను చేసేలా తెచ్చిన బిల్లును ఆయన సమర్థించారు. 'తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటి మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఈ బిల్లులను చూసి భయపడాల్సిన అవసరం లేదు. ఏదైనా భయపడితే అత్యధిక రాష్ట్రాల్లో, కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపాయే భయపడాలి. కానీ మేం నైతిక విలువలకు కట్టుబడి ఇలాంటి చర్యలకు సిద్ధమయ్యాం' అని తెలిపారు.




మొదటి పేజీ తరువాయి

# ఇండీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి నామినేషన్

న్యూఢిల్లీ, ఈ కబురు: ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ వేశారు. గురువారం ఉదయం 11.30 గంటలకు రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోడీకి తన నామినేషన్‌పత్రాలు సమర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎన్‌సీపీ నేత శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాంగోపాల్ యాదవ్, డీఎంకే ఎంపి తిరుచ్చి శివ, శివసేన(యుబిటి) ఎంపీ సంజయ్ రావత్, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ, టీఎంసీ ఎంపీ శతాబ్ది రాయ్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఇతర ప్రతిపక్ష నేతలు ఇండీ కూటమి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్లమెంట్ ఆవరణలో మహాత్మాగాంధీ, జ్యోతిబా పూలే, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించిన తర్వాత జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. నాలుగు సెట్లుగా సమర్పించిన నామినేషన్ పత్రాల్లో 200 మంది ఎంపీలు సంతకాలు చేశారు.

కేసీఆర్‌తో మాట్లాడతా: కేజ్రీవాల్

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గురువారం సాయంత్రం ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను ఆయన ఇంటికి వెళ్లి కలుసుకుని తనకు మద్దతు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను గెలిపించేందుకు తాను శాయశక్తులా ప్రయత్నిస్తానని కేజ్రీవాల్ చెప్పారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడతానని ఆయన సుదర్శన్‌రెడ్డికి చెప్పినట్లు తెలిసింది. తాను కూడా రాష్ట్రాలకు వెళ్లి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రయత్నిస్తానని కేజ్రీవాల్ అన్నారు. తృణమూల్ నేత కల్యాణ్ బెనర్జీ, కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ సుదర్శన్‌రెడ్డితో పాటు కేజ్రీవాల్‌ను కలుసుకున్నారు. కేజ్రీవాల్ తన ఇంటి బయట మీడియాతో మాట్లాడుతూ, విప్ లేకుండా సీక్రెట్ బ్యాలట్ ద్వారా జరుగుతున్న ఎన్నికల్లో అన్ని పార్టీల ఎంపీలు నిర్భయంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. న్యాయమూర్తిగా దేశానికి అద్భుతమైన సేవ చేసిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి లాంటి వ్యక్తిని ఎన్నుకుంటే ఉప రాష్ట్రపతి పదవికే వన్నె తెచ్చినట్లు అవుతుందని చెప్పారు. సుదర్శన్‌రెడ్డి కేవలం ప్రతిపక్షాల అభ్యర్థి కాదని, ఈ దేశ అభ్యర్థిగా భావించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రుల ఆత్మగౌరవం నినాదానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రాధాన్యం ఉన్నందువల్ల రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నేతలను జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయాలని కోరతానని చెప్పారు. తాను ఏ రాజకీయ పార్టీ సభ్యుడిని కాదని, ఉప రాష్ట్రపతి బాధ్యత రాజకీయ బాధ్యత కాదని సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్వతంత్రంగా, నిష్పాక్షికంగా నిర్వహించాల్సిన రాజ్యాంగ బాధ్యతను న్యాయమూర్తిగా కూడా నెరవేర్చానని చెప్పారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే అదే బాధ్యతను నెరవేరుస్తానని చెప్పారు.

త్వరలో అఖిలేష్, మమత, సోరేన్‌లతో భేటీ

కేజ్రీవాల్‌ను కలిసిన అనంతరం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. శుక్రవారం సీనియర్ న్యాయవాది ప్రతాప్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న తర్వాత ఆయన సాయంత్రానికి ఢిల్లీ తిరిగి వస్తారు. ఢిల్లీ చేరుకున్న తర్వాత అన్ని పార్టీల ఎంపీలకు తనను గెలిపించాలని కోరుతూ లేఖలు పంపాలని ఆయన నిర్ణయించారు. ఈ నెల 26న సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్‌ను కలుసుకునేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి లక్నో వెళుతున్నారు. బెంగాల్‌కు వెళ్లి మమతా బెనర్జీని, జార్ఖండ్‌కు వెళ్లి హేమంత్ సోరెన్‌ను కూడా ఆయన కలుసుకోనున్నారు. తన పర్యటన కార్యక్రమాలను, ఇతర వ్యూహాలను ఇండియా కూటమికి చెందిన కోర్ కమిటీ సభ్యులు నిర్ణయిస్తున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో సహా ఎన్డీఏ ముఖ్యమంత్రులను కలిసేందుకు కూడా ప్రయత్నించాలని సుదర్శన్‌రెడ్డి భావిస్తున్నారు. కేసీఆర్‌ను కూడా కలుసుకునేందుకు ప్రయత్నిస్తానని ఆయన సన్నిహిత వర్గాలకు తెలిపారు.

ఇది సైద్ధాంతిక పోరు

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగ విలువల పట్ల బాధ్యతతో, అచంచలమైన నిబద్ధతతో ప్రతిపక్ష ఉమ్మడి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశానని తెలిపారు. ఈ పోటీ ఒక వ్యక్తికి సంబంధించింది కాదని, పార్లమెంట్ పరస్పర గౌరవంతో నడిచేందుకు, అసమ్మతిని కూడా గౌరవించేందుకు, దేశంలో వ్యవస్థలు స్వతంత్రంగా ప్రజలకు సేవ చేసేందుకు జరుగుతున్న సైద్ధాంతిక పోరుగా దీన్ని భావించాలని, అది భారతీయ దృక్పథాన్ని ప్రతిబింబించాలని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, లా విద్యార్థిగా, భారత రిపబ్లిక్ ప్రజాస్వామిక సంప్రదాయాలను జీర్ణించుకున్న పౌరుడిగా భారతదేశ నిజమైన శక్తి ఏమిటో తన జీవితంలో తెలుసుకున్నానని చెప్పారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉన్నత సంప్రదాయాలను పరిరక్షించే బాఽధ్యత రాజ్యసభ చైర్మన్‌గా ఉప రాష్ట్రపతికి ఉన్నదని, నిష్పాక్షికంగా, హుందాగా, పరస్పర చర్చలు, విలువల పట్ల మొక్కవోని అంకితభావంతో విధిని నిర్వహిస్తానని చెప్పారు. రాజ్యాంగం పట్ల గౌరవం, ప్రజల పట్ల విశ్వాసంతోనే ఈ ప్రయాణం ప్రారంభించానని తెలిపారు.

# సిద్ధాంతాల్లో రాజీ లేదు

రాబోయే ఎన్నికల్లో టీవీకే, డీఎంకే మధ్యే పోటీ అన్నారు. రాజకీయ లబ్ధికి పార్టీని ప్రారంభించలేదని, సిద్ధాంతాల విషయంలో ఎప్పటికీ రాజీ పడలేదన్నారు. మనది ఆత్మగౌరవ కూటమిగా ఉండాలని తెలిపారు. ఒకవైపు ఆర్ఎస్ఎస్‌కి బానిసగా ఉంటూ మరోవైపు లౌకిక కూటమి అని మోసం చేసేలా ఉండదన్నారు. ప్రజల ప్రేమ, ఆశీర్వాదం ఉండగా భాజపాతో పరోక్ష, ప్రత్యక్ష కూటమి ఎందుకన్నారు. నమ్మి వచ్చే వారికి పాలనలో, అధికారంలో భాగస్వామ్యం ఇవ్వాలన్నారు. 'ఎదిర్‌కాలం వరుం, ఎన్ కడమై వరుం' అని ఎంజీఆర్ పాడిన పాటను ఆలపించారు. స్టాలిన్ అంకుల్.. మీ పాలనలో నిజాయితీ ఉందా? న్యాయం ఉందా? శాంతి భద్రతలు ఉన్నాయా? మహిళలకు భద్రత ఉందా? అని ప్రశ్నించారు. రూ.1000 ఇస్తే సరిపోతుందా, భద్రతలేదని మహిళలు ఏడ్చే శబ్దం వినిపించలేదా అన్నారు. ఓ దేశంలో రాజు సైన్యాధిపతి కోసం వెతికారంటూ చెప్పిన చిన్నకథ ఆకర్షించింది. త్వరలో ప్రజలను కలుస్తానని చెప్పారు. దేశానికి నైపుణ్యం మాత్రమే సరిపోదని నిజం, నిజాయితీ కూడా ముఖ్యమని తెలిపారు. తమ పార్టీ విక్రవాండిలో నిర్వహించిన తొలి మహానాడు రాష్ట్ర రాజకీయాల వాతావరణాన్ని మార్చేసిందని విజయ్ గుర్తుచేశారు. ఆ తర్వాత ప్రస్తుతం ఇక్కడ వినిపిస్తున్నది మొత్తం తమిళుల గొంతు అన్నారు.

పార్టీ పతాకావిష్కరణ

ప్యారిస్: వేదికపై ఏర్పాటు చేసిన అంబేడ్కర్, పెరియార్ తదితరుల చిత్రపటాలకు విజయ్ నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యకర్తల మధ్య ఏర్పాటు చేసిన వేదికపై నడుచుకుంటూ వెళ్లిన కండువాలు విసిరారు. ఆ సమయంలో ఆయన ఆలపించిన పాట వినిపించారు. విప్లవాన్ని ప్రారంభించారు... విజయ్ ఓ పార్టీని కాదని, విప్లవాన్ని ప్రారంభించారని టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సి ఆనంద్ తెలిపారు. ఇక్కడికొచ్చిన ప్రజలందరి నోటి నుంచి గెలుపు..గెలుపు.. అనే మాటలు వినిపిస్తున్నాయన్నారు. ఆదవ్ అర్జున మాట్లాడుతూ.. అన్నా, ఎంజీఆర్ సిద్ధాంతాలను ఆచరణలో పెట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే విజయ్‌తోనే సాధ్యమవుతుందని చెప్పారు.

మహానాడు ప్రారంభమైన కొంతసేపటికే కార్యకర్తలు ప్రాంగణం నుంచి వెళ్లిపోతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

కార్యకర్త మృతి...చెన్నై ఊరప్పాక్కంకి చెందిన పార్టీ కార్యకర్త ప్రభాకరన్(33) మహానాడుకు వాహనంలో వెళుతూ సక్కిమంగలం వద్ద కిందకు దిగాడు. అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మహానాడు విజయవంతం కావాలని విజయ్‌కు ఆయన తల్లి శోభ చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె తెలిపిన సందేశంలో ..'తెరపై మిమ్మల్ని చూసి ఎదుగుదలకు తోడ్పడిన తల్లులు, తమ్ముళ్లు, చెల్లెళ్లు రాజకీయ విజయానికి అండగా నిలుస్తారు. రాబోయే ఎన్నికల్లో విజయాన్ని అందిస్తారు. సింహాసనాన్ని అధిరోహించే రోజు వస్తుంది. అది కార్యకర్తల తిరునాల. టీవీకే అడ్డంకులను గెలిచే కళగంగా చూపించాలి. మీ విజయానికి ఆకాశమే హద్దు' అని పేర్కొన్నారు.సీమాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు..మహానాడు మైదానంలో టీవీకే కార్యకర్తలు సీమాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇటీవల టీవీకే, కార్యకర్తలను సీమాన్ తీవ్రంగా విమర్శించిన నేపథ్యంలో ఇలా నినాదాలు చేశారు. ఎండ తీవ్రతకు ఇబ్బందులు.. కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా ప్రాంగణానికి తరలివచ్చారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో నిర్దేశిత సమయం కన్నా ముందుగానే ప్రారంభించారు. పారపత్తిలో 500 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాట్లు చేశారు. మహానాడులో రద్దీలో చిక్కుకుని 10 మందికిపైగా స్పృహ కోల్పోయారు. వారికి అక్కడి వైద్య శిబిరంలో చికిత్స అందించారు. ఎండను తట్టుకోలేక పలువురు చిన్నారులు ఇబ్బందిపడ్డారు. వేడి అధికంగా ఉండడంతో డ్రోన్ల సాయంతో నీళ్లు పిచికారీ చేశారు. తాగునీటి సీసాలు, స్నాక్స్ అందించారు.

# బిజెపి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా రాధాకృష్ణ యాదవ్



గంగల రాధాకృష్ణ యాదవ్

**తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమే : రాధాకృష్ణ యాదవ్**

ఈ-కబురు, శేరిలింగంపల్లి : బిజెపి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు గంగల రాధాకృష్ణ యాదవ్ నియమితులయ్యారు. తాజాగా ప్రకటించిన రంగారెడ్డి జిల్లా కార్యవర్గంలో గంగల రాధాకృష్ణ యాదవ్ ను ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ బిజెపి పార్టీ పటిష్టత కోసం తాను చేసిన సేవలను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షుడు గా నియమించిన పార్టీ అధిష్టానానికి అండగా నిలిచిన శేరిలింగంపల్లి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతానని అన్నారు. పార్టీ అప్పగించిన పదవిని ఒక బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. బిజెపి పార్టీ దేశం కోసం ధర్మం కోసం ప్రజా సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని, నవ భారతాన్ని ప్రపంచానికి చూపిస్తుందన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది అధికారం కోసం కాదని, ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. విద్యార్థులు, యువత, కార్మికులు, మహిళల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా ముందుంటానని తెలిపారు. బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ ఉపాధ్యక్షుడిగా జిల్లా పరిధిలో శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలో పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

# ఆత్మీయ సభ విజయవంతానికి ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలి : కొమిరిశెట్టి సాయిబాబా



మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఆహ్వానం పలుకుతున్న సాయిబాబా, రంగారావు

**మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి ఆహ్వానం**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సభ విజయవంతానికి నియోజకవర్గ పరిధిలోని ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత తీసుకోవాలని నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పిలుపునిచ్చారు. ఈనెల 24వ తేదీన మియాపూర్ లో నిర్వహించే శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సభ సన్నాహక సమావేశాల్లో భాగంగా గురువారం గచ్చిబౌలి డివిజన్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన మియాపూర్ నరేన్ గార్డెన్స్ లో నిర్వహించనున్న శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తో పాటు ముఖ్య నాయకులు హాజరవుతున్నారన్నారు. కీలకమైన ఈ సమావేశంలోని నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి పార్టీ జెండా ఎగరవేయడమే ధ్యేయంగా.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టవలసిన పోరాట కార్యక్రమాలపై ప్రణాళికకు ఈ సమావేశం వేదిక కానుందన్నారు. ఆత్మీయ సమావేశానికి గచ్చిబౌలి డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశానికి హాజరుకావాలని కోరుతూ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసిన సాయిబాబా, రంగారావులు ఆహ్వానం పలికారు. గచ్చిబౌలి డివిజన్ విస్తృత స్థాయి సమావేశంలో నాయకులు అంజమ్మ, దారుగుపల్లి నరేష్, సతీష్ ముదిరాజ్, నాగపూరి అశోక్ యాదవ్, రమేష్ గౌడ్,పరమేష్, శాప్లైట్ శ్రీనివాస్, అలీం, నవాజ్, ఖాదర్ ఖాన్, మక్ బూల్, తాహెర్, బురాన్,బాలమణి, మాధవి, సుగుణ, అజీమ్, లాయక్ ఖాన్, జాకీర్, బాలరాజ్ గౌడ్, అజయ్ గౌడ్, వినోద్ కుమార్, మణి తేజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలి డివిజన్ విస్తృత స్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న సాయిబాబా

# తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు : అనీల్ కుమార్ యాదవ్



పాఠశాలను సందర్శిస్తున్న అనీల్ కుమార్ యాదవ్ తదితరులు



వ్యర్థాలతో నిండిన పాఠశాల ఆవరణ

**గోపి నగర్ ప్రభుత్వ పాఠశాల పరిశీలన**

ఈకబురు, శేరిలింగంపల్లి : దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని, ఉత్తమ విద్యా విధానంతో దేశ భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ అభిప్రాయపడ్డారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపి నగర్ లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి అనిల్ కుమార్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల మొత్తం కలియతిరిగిన అనిల్ కుమార్ యాదవ్ స్కూల్ ఆవరణలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను స్థానిక ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనానికి పలు మరమ్మత్తులు స్కూల్ ఆవరణలో మౌలిక వసతుల సమస్యను అనిల్ కుమార్ యాదవ్ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా విధానాన్ని పటిష్టంగా మార్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు స్వచ్ఛంద సంస్థలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సామేల్ కార్తీక్, కాటా నరసింహ గౌడ్, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మొదటి పేజి తరువాయి

# 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

హైదరాబాద్, ఈ కబురు: రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ, జర్నలిస్టు, ఉద్యోగుల ఆరోగ్య పథకం వైద్య సేవలను ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి నిలిపి వేయనున్నట్లు తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్(టీఏఎన్‌హెచ్ఏ) ప్రకటించింది. బకాయిల చెల్లింపులో జాప్యం, ఆర్థిక భారం పెరగడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీఏఎన్‌హెచ్ఏ తెలిపింది. ఈ మేరకు గురువారం ఆరోగ్యశ్రీ సీఈవోకు లేఖ రాసిన టీఏఎన్‌హెచ్ఏ... జనవరిలో ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.1,3001,400 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేసింది. బకాయిలు గణనీయంగా పెరగడంతో చిన్న, మధ్య తరగతి ఆస్పత్రులను మూసివేసుకునే పరిస్థితి నెలకొందని టీఏఎన్‌హెచ్ఏ అధ్యక్షుడు వద్దిరాజు రాకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలను 45 నెలల్లో చెల్లిస్తామని, ప్యాకేజీలను సవరిస్తామని మంత్రి ఇచ్చిన హామీ, ఆరు నెలలు గడిచినా అమలుకు నోచుకోలేదని లేఖలో పేర్కొన్నారు.



# భారత్ చైనా కరుగుతున్న మంచు



ఈ కబురు:ఫిబ్రవరి 2014లో చైనా అధ్యక్షుడు క్సి జిన్పింగ్ మళ్ళీ క్రీ.పూ. నాటి 'సిల్క్ రూట్'ను పునరుద్ధరిస్తున్నాం, అని ప్రకటించినప్పుడు చైనాకు అదొక అత్యాశతో కూడిన కల అని ప్రపంచం అనుకుంది. ప్రపంచం అలా అనుకుని వుండొచ్చు, కానీ సరిహద్దున ఉన్న మనమూ అలాగే అనుకుని సరిపెట్టేసుకున్నాం. అప్పటికి ఒబామా రెండవసారి అధ్యక్షుడు కావడంతో ఆసియా-పసిఫిక్ కేంద్రిత అంతర్జాతీయ వ్యవహారాల్లో మనం చురుగ్గా ఉన్నాం. సరిహద్దున చైనాను నిలువరించడానికి మన దేశం 'ఆసియాన్' వాణిజ్య కూటమిలో ఉండడం 'జియో-పొలిటికల్'గా తగిన సమతూకం అని ఎన్డీఏ ప్రభుత్వం భావించింది. రేపు ఆ వెసులుబాటు ఏ కారణం వల్లనైనా జారిపోతే, అప్పుడు మన వైఖరి ఎలావుండాలి అనే ముందస్తు ఆలోచనను అప్పట్లో మనం చేయలేదు.

ట్రంప్ వచ్చి 23 జనవరి 2017న 'ట్రాన్స్-పసిఫిక్' ఒప్పందంలో ఇకముందు అమెరికా ఉండదని ప్రకటించారు. ట్రంప్ నిర్ణయంతో చైనా తన దక్షిణ సరిహద్దున ఆగ్నేయ ఆసియా దేశాలపై ఆధిక్యత కోసం, ముడుచుకున్న కాళ్ళు కాస్తా బార్లా చాపింది! మారిన ట్రంప్ వ్యూహం వల్ల ఆసియాలో ఏమి జరుగుతోందని ఆరా తీసేంత స్థిమితం అమెరికాకు లేకపోయింది. అదను ఎంచి, మొదట 'సిల్క్ రూట్' ప్రకటించిన చైనా దాన్ని 'వన్ బెల్ట్ - వన్ రోడ్'గా మార్చింది. చైనా అధ్యక్షుడు జిన్పింగ్ 'సిగ్నేచర్ ప్లాన్'గా ప్రపంచ మీడియా అభివర్ణించిన 'ఓబీఓఆర్' అధికారిక ప్రకటన బీజింగ్‌లో 28 దేశాల అధిపతులు, వంద దేశాలకు చెందిన ప్రతినిధుల మధ్య 2017 మే 14-15 తేదీల్లో ఘనంగా జరిగింది. రష్యా నుంచి వ్లాదిమీర్ పుతిన్, బ్రిటన్ నుంచి తెరిస్సా మే, ఫిలిప్పీన్స్ నుంచి డి రోడ్రిగో, పాక్ నుంచి నవాజ్ షరీఫ్ వంటి వారు వచ్చారు. యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుట్రెస్, ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ జిం యంగ్ కిం, ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టియోనా లెగర్డే ఆ రోజు అక్కడ ఉన్నారు. యాభైకి పైగా వాణిజ్య ఒప్పందాలు జరిగాయి. చివరికి అమెరికా, జపాన్ సైతం చైనాతో ఉన్న వాటి అభ్యంతరాలను పక్కన పెట్టి తమ ప్రతినిధులను బీజింగ్‌కు పంపాయి. అయితే భారత్ దీనికి హాజరు కాలేదు!

జరిగింది ఏమిటి? అని చూసినప్పుడు ప్రపంచీకరణ ప్రభావాన్ని సకాలంలో అంచనా వేసి, ఆసియాలో అందరి కంటే ముందుగా ఆసియా, యూరప్, ఇండో-పసిఫిక్ దేశాలతో చైనా తన వాణిజ్య బంధనాలను ముడివేసుకుంది. ఇంకా అభివృద్ధి చెందని తన మైదాన ప్రాంతానికి 'బెల్ట్' పేరుతో ఉపరితల రవాణా ద్వారా మధ్య ఆసియా దేశాలకు తలుపులు తెరిచింది. 'రోడ్' ద్వారా సముద్ర జలాల నుంచి ఆగ్నేయ ఆసియా దేశాల్లోకి నూతన వాణిజ్య ద్వారాలను తెరిచింది. ఇదిలా ఉంటే, వారం ముందు వరకు ఈ సదస్సుకు హాజరుపై మన నిర్ణయం అసందిగ్ధంగానే మిగిలింది.ఇంతకీ ఈ చైనా చొరవపై మోదీ ప్రభుత్వ అభ్యంతరం ఏమిటి? 'బెల్ట్'లో భాగంగా చైనాలోని ఖష్గర్ నుంచి పాక్ పశ్చిమ తీరాన అరేబియన్ సముద్రంలో ఉన్న గ్వాదర్ పోర్టుకు 'చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్' పేరుతో ఒక ప్రత్యేక రోడ్డును నిర్మించింది. ఇది 3 భాగాలుగా వుంది. ఇందులో మొదటిదైన 1300 కి.మీ. కారకోరం హైవే- చైనా నుంచి బయలుదేరి- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోకి ప్రవేశించి, అక్కణ్ణించి ఇస్లామాబాద్‌లోకి ప్రవేశిస్తుంది. అలా అది పాకిస్థాన్ భూభాగాన్ని తూర్పు నుంచి పడమరకు ఆసాంతం దాటి గ్వాదర్ పోర్ట్ చేరుతుంది. మోదీ ప్రభుత్వం ఇందుకు అభ్యంతరం చెబుతున్నది.మన సరిహద్దున ఉన్న పొరుగు దేశం మరొక దేశంలో నుంచి తూర్పు పడమరలను కలుపుతూ 3217కి.మీ. హైవే వేసుకుని వ్యాపారం చేసుకుంటుంటే- తన ప్రయోజనం కోసం పాక్ అందుకు అనుమతించింది. అయితే దాన్లో పాక్ ఆక్రమిత కశ్మీర్ ఉండడం, భారత సార్వభౌమ అధికారాన్ని ధిక్కరించడంగా మోదీ ప్రభుత్వం భావించింది. నిజానికి ఇండియా అప్పుడే దాన్ని ఒక అవకాశంగా తీసుకుని 'రికార్డు'లో అది- 'పాక్ ఆక్రమిత కాశ్మీర్' అనే 'క్లాజ్'తో దాన్ని అంగీకరించి ఉంటే, ఎలా ఉండేదో? కానీ అది జరగలేదు.ఇది జరిగిన నెలలోపే, బీజింగ్‌లో జరగవలసిన తొమ్మిదవ 'బ్రిక్స్' సదస్సు ముందస్తు సన్నాహాలపై జూన్ 10-12న చైనా సభ్యదేశాల ప్రతినిధులను పిలిచింది. ఇండియా అప్పటి బీజేపీ జనరల్ సెక్రటరీ రాంమాధవ్‌ను చైనాకు పంపి, 'వన్ బెల్ట్-వన్ రోడ్' ఆరంభానికి భారత్ గైర్హాజరీపై మన సమర్థనకు ఆయన్ని ప్రతినిధిగా ఎంచుకుంది. ఇది జరిగాక చైనా అధ్యక్షుడు జిన్పింగ్ 2019 అక్టోబర్ 11-12న ఇండియాకు సౌహార్ద పర్యటనకు వస్తే, అందుకు తగిన వేదికగా మొదట వారణాసి అనుకొని, ఆ తర్వాత దాన్ని తమిళనాడు మహాబలిపురం సముద్ర తీరానికి మార్చారు. శ్రీలంక తీరంలో చైనా తిష్టవేసుకున్న వేళ, ఎన్డీఏ రాజకీయ అవసరాల కోసం దక్షిణాదిన ఇటువంటి స్థల మార్పు చేశారు. వరుసగా మోదీ మూడు 'టర్మ్'ల విజయం తర్వాత 2025 నాటికి 'బ్రిక్స్' దేశాల కూటమి బలపడి, 'గ్లోబల్ సౌత్' భావన ముందుకు వచ్చింది. పైగా వచ్చే ఏడాది 'బ్రిక్స్' సదస్సుకు ఇండియా ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. 'బ్రిక్స్' దేశాల మధ్య 'సౌత్-సౌత్ కోపరేషన్' తప్పనిసరి అయింది. ఈ కాలంలో చైనా-పాక్‌లతో 'ఎన్డీఏ' ప్రభుత్వం అనుసరించిన దౌత్య విధానం మాటేమిటి? సమాధానం చెప్పవలసిన అనివార్యత ఏర్పడడంతో ఆగస్టు 31న మోదీ చైనా వెళుతున్నారు. ఏడేళ్ల తర్వాత మన వైపు నుంచి మొదలైన ఈ కదలికతో, చైనా విదేశాంగ మంత్రి ఇండియాకు వచ్చివెళ్ళారు.

# మియాపూర్ లో దారుణం...

» ఒకే కుటుంబంలో ఐదుగురి అనుమానస్పద మృతి
» విషయం కలిసిన ఆహారం తిన్నారని అనుమానం
» హత్యా... ఆత్మహత్యా... అనే కోణంలో పోలీసుల దర్యాప్తు

ఈకబురు, శేరిలింగంపల్లి : హైటెక్ సిటీ పరిధిలోని మియాపూర్ లో దారుణం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అనుమానస్పద స్థితిలో మృతిచెందడం సంచలనంగా మారింది. గురువారం తెల్లవారు జామునే తెలిసిన ఈ సంఘటనతో మియాపూర్ ఉలిక్కిపడింది. మియాపూర్ మక్తా మహబూబ్ పేట్ లో ఉండే ఓ ఇంట్లో వృద్ధ దంపతులు, వారి కుమార్తె, అల్లుడు, రెండేళ్ల మనుమడు సొంత ఇంట్లో మృతి చెంది ఉండడం సంచలనంగా మారింది. విషం కలిసిన ఆహారం తినడంతోనే ఐదుగురు మృతిచెందినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. కాగా ఈ ఐదుగురి మృతికి కారణం ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే మియాపూర్ పోలీసులు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు, మృతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం...

కర్ణాటక రాష్ట్రం గుల్బార్గా జిల్లా సెడాం పరిధిలోని రంజోల్ గ్రామానికి చెందిన ఉప్పరి లక్ష్మయ్య (61), భార్య ఉప్పరి వెంకటమ్మ(55) దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వీరి పెద్ద కుమార్తె లక్ష్మి గత 10 సంవత్సరాల క్రితం చాంద్ పాషా అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకోగా. వీరు బాచుపల్లిలోని సాయిక్రిష్ణహిల్స్ లో నివాసం ఉంటున్నారు. రెండవ కుమార్తె కవిత(24)ను గత మూడు సంవత్సరాల క్రితం కర్ణాటకకే చెందిన అనీల్(32) కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఓ కుమారుడు యువాన్స్(2) సంతానం. మూడవ కుమార్తె నవితను లింగంపల్లిలో నివాసం ఉండే దుర్గా ప్రసాద్ కు ఇచ్చి గత సంవత్సరం క్రితం వివాహం జరిపించారు. లక్ష్మయ్య, వెంకటమ్మలు గతంలో బాచుపల్లిలోని వికాస్ స్కూల్లో వాచ్ మెన్, అటెండర్ గా పనిచేస్తూ అక్కడే ఉండేవారు. కాగా మియాపూర్ కు మకాం మార్చిన వీరు గత రెండేళ్లుగా మక్తా మహబూబ్ పేట్ లో అద్దెకు ఉంటున్నారు. లక్ష్మయ్య స్థానికంగా మేస్త్రీ వనిచేస్తుండగా, వెంకటమ్మ స్కూల్ అటెండర్గా పనిచేస్తుంది. వీరి కుమారుడు భగవంత్ సాగర్ ఆటో నడువుకుంటూ వీరితోనే ఉంటున్నాడు. కాగా లక్ష్మయ్య కాలుకు గాయం కావడంతో గతకొద్ది రోజులుగా ఇంటి వద్దే ఉంటుండగా, కుమారుడు భగవంత్ స్నేహితులతో కలిసి పెళ్లి వేడుక కోసం ఈనెల 18న వైజాగ్ వెళ్లాడు. లక్ష్మయ్య రెండవ కుమార్తె కవిత, అల్లుడు అనీల్ లు గతంలో కాళీమందిర్ వద్ద ఉండగా, అక్కడ పని దొరక్కపోవడంతో వది రోజుల క్రితం కుటుంబంతో కలిసి లక్ష్మయ్య ఇంటికి వచ్చారు. అప్పటి నుంచి వారు ఇక్కడే ఉంటున్నారు. బుధవారం వెంకటమ్మ నీరసంగా ఉందని చెప్పడంతో పెద్దకుమార్తె లక్ష్మి. ఆమె భర్త బాంద్ పాషాలు లక్ష్మయ్య ఇంటికి వచ్చి రాత్రి 11 గంటలకు తిరిగి వెళ్లిపోయారు. కాగా వెంకటమ్మతో కలిసి స్కూల్లో పనిచేసే కార్మికురాలు గురువారం ఉదయం 5 గంటలకు తలుపు కొట్టగా, స్పందన లేకపోవడంతో ఆమె పెద్ద కుమార్తె లక్ష్మికి సమాచారం అందించింది. హుటాహుటిన లక్ష్మి మియపూర్ లోని లక్ష్మయ్య ఇంటికి చేరుకొని తలుపులు బద్దలు కొట్టి చూడగా, లక్ష్మయ్య, వెంకటమ్మ. రెండవ కుమార్తె కవిత, ఆమె భర్త అనీల్, మనుమడు యువాన్స్ లు విగతజీవులుగా పడిపోయి మృతిచెంది కనిపించారు. స్థానికుల సమాచారంతో మియాపూర్: పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు. ఈమేరకు మియాపూర్ పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



లక్ష్మయ్య వెంకటమ్మ దంపతులు( ఫైల్)

**హత్యా.. ఆత్మహత్యా....**

బుధవారం రాత్రి స్థానికులతో సాధారంగానే మాట్లాడిన లక్ష్మయ్య కుటుంబం గురువారం తెల్లవారే సరికి మృతిచెందడం స్థానికంగా సంచలనంగా మారింది, మరణానికి ముందు వాంతులు చేసుకున్న ఆనవాళ్లు ఉండడంతో విషాహారం తిన్న కారణంగానే మృతిచెంది ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. బుధవారం రాత్రి దోశలు, గుంత పొంగనాలు, పెరుగు అన్నం తిన్నట్లు గుర్తించారు. పెరుగు అన్నంలో గుర్తు తెలియని పొడి కలుపుకొని తినడంతోనే మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. బుధవారం రాత్రి 11 గంటల వరకు పెద్దకుమార్తె, అల్లుడు వీరి ఇంట్లోనే ఉండగా, అంతకు ముందే వీరు ఆహారం తిన్నారా. లేక వారు వెళ్లిన తరువాత తిని ఉంటారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు వీరు తిన్న ఆహారంలో ఎవరైనా విషం కలిపారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే పోలీసులు పలువురు ఆనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. మరోవైపు పెళ్లివేడుకకు వెళ్లిన కుమారుడు భగవంత్ సాగర్ ఇక్కడే ఉంటే అతను సైతం మృతిచెంది ఉండేవాడని స్థానికులు అనుమానిస్తున్నారు.



ఇంటి ఆవరణలో పడిఉన్న మృతదేహాలు



కుమారుడు యువన్ష్ తో అనిల్, కవిత దంపతులు (ఫైల్)

# మారిన రీచార్జ్ ప్లాన్లు.. ఏది చవక.. లాభదాయకం?

దేశంలోని ప్రముఖ టెలికం కంపెనీలు తమ రీచార్జ్ ప్లాన్లలో ఇటీవల మార్పులు చేశాయి. కొన్ని ఎంట్రీ లెవల్ ప్లాన్‌లను తొలగించాయి. అయితే ఇప్పటికీ దేశంలోని ఇతర టెలికాం ఆపరేటర్లతో పోలిస్తే రిలయన్స్ జియో మొబైల్ వినియోగదారులకు అత్యంత చవకైన ఎంపికగా కొనసాగుతోందని బీఎన్‌పీ పారిబాస్ ప్లాన్ విశ్లేషణ నివేదిక తెలిపింది.

మూడు ప్రధాన టెలికాం ఆపరేటర్లు జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా తమ పాపులర్ రీఛార్జ్ ప్లాన్ల ధరలను సవరించాయి. ఈ క్రమంలో ఏ టెలికం కంపెనీలో రీచార్జ్ ప్లాన్లు చవకగా.. లాభదాయకంగా ఉన్నాయన్నదానిపై బీఎన్‌పీ పారిబాస్ విశ్లేషించింది. ఇందులో జియో ఇప్పటికీ అదే ధర పాయింట్లలో అధిక డేటా ప్రయోజనాలను అందిస్తోందని తేల్చింది.

28 రోజుల ప్లాన్‌కు ఇప్పడు ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియా మూడు కంపెనీల్లోనూ ధర రూ .299గానే ఉంది. అయితే ప్రయోజనాలపరంగా చూస్తే జియో ఇప్పటికీ అధిక డేటా బెనిఫిట్‌లను అందిస్తోంది. దీంతో ఎక్కువ డేటా వినియోగించే కస్టమర్లకు జియో మరింత చౌకైన ఎంపికగా నిలిచిందని నివేదిక పేర్కొంది.

జియోలో అందుబాటులో ఉన్న ప్లాన్లలో, రూ .799 ప్లాన్ 84 రోజుల పాటు రోజుకు 1.5 జీబీ డేటాను అందిస్తుంది. మరోవైపు, రూ .249 ప్లాన్ ఇప్పడు ఫిజికల్ జియో స్టోర్లలో మాత్రమే అందుబాటులో ఉంది. ఆన్‌లైన్‌లో తొలగించింది. రూ .209 వాయిస్-ఓన్లీ ప్లాన్ కేవలం మై జియో యాప్‌లో మాత్రమే అందుబాటులో ఉంది.

ఇక రూ .189 ప్లాన్‌లో అపరిమిత వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, 2 జీబీ డేటా, 28 రోజుల వ్యాలిడిటీతో అందిస్తోంది. ఇంకా రూ.209 ప్లాన్ 22 రోజుల పాటు రోజుకు 1 జీబీని అందిస్తుంది. రూ.299 ప్లాన్ 28 రోజుల పాటు రోజుకు 1.5 జీబీ, రూ.349 ప్లాన్ 28 రోజుల పాటు రోజుకు 2 జీబీని అందిస్తున్నాయి. ఎయిర్‌టెల్, వీఐ ప్లాన్లతో పోలిస్తే జియో కస్టమర్లు నెలకు రూ.50 లబ్ధి పొందుతున్నారని నివేదిక విశ్లేషించింది.

ఉదాహరణకు, రోజుకు 1.5 జీబీ, 28 రోజుల ప్లాన్ ధర జియోకు రూ .299, ఎయిర్‌టెల్, బీఐలు అదే ప్రయోజనం కోసం రూ .349 వసూలు చేస్తున్నాయి. అంటే జియో వినియోగదారులకు నెలకు రూ .50 ఆదా అవుతుందన్న మాట. అదేవిధంగా రోజుకు 2 జీబీ డేటా అందించే 28 రోజుల ప్లాన్‌కు జియో రూ.349, ఎయిర్‌టెల్ రూ.398, వీఐ రూ.365 వసూలు చేస్తున్నాయి. ఎయిర్‌టెల్‌తో పోలిస్తే రూ.49, వీఐతో పోలిస్తే రూ.16 చొప్పన జియో యూజర్లకు నెలకు ఆదా అవుతుంది.

## ఈపీఎఫ్‌వో 'కొత్త' రికార్డ్..


ఉద్యోగుల భవిష్య నిధి.. ఈపీఎఫ్‌వోకు జూన్‌లో నికరంగా 21.89 లక్షలమంది సభ్యులు కొత్తగా జత కలిశారు. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. వార్షికంగా 13.5 శాతం వృద్ధి నమోదైంది. నెలవారీగా చూస్తే ఈ సంఖ్య 9.15 శాతం బలపడింది. కార్మిక శాఖ వెల్లడించిన ప్రొవిజనల్ గణాంకాలివి. వీటి ప్రకారం 2018 ఏప్రిల్‌లో ఈపీఎఫ్‌వో పేరోల్ గణాంకాల విడుదల ప్రారంభించాక గరిష్టస్థాయిలో సభ్యులు జత కలడం గమనార్హం!

ఉద్యోగ అవకాశాలు పుంజుకోవడం, ఉద్యోగ లబ్ధిపై అవగాహన పెరగడానికితోడు ఈపీఎఫ్‌వో ప్రభావవంత కార్యక్రమాలు ఇందుకు దోహదపడినట్లు కార్మిక శాఖ పేర్కొంది. కాగా.. 2025 జూన్‌లో 10.62 లక్షలమంది కొత్త సబ్‌స్కయిబర్లు ఎన్‌రోల్ అయ్యారు. 2025 మేతో పోలిస్తే 12.7 శాతం అధికంకాగా.. వార్షికంగా 3.6 శాతం వృద్ధి ఇది. వీరిలో 18-25 మధ్య వయసు కలిగినవారి సంఖ్య 6.39 లక్షలమంది. అంటే 60 శాతానికిపైగా వాటా వీరిదే.

ఈ గ్రూపులో నికర పేరోల్ జమలు 9.72 లక్షలుగా నమోదైంది. ఇంతక్రితం వైదొలగినవారు సుమారు 16.93 లక్షలమంది 2025 జూన్‌లో ఈపీఎఫ్‌వోకు జత కలిశారు. ఈ కాలంలో 3.02 లక్షలమంది మహిళలు ఈపీఎఫ్‌వో కొత్త సబ్‌స్కయిబర్లుగా చేరారు. 2025 మే నెలతో పోలిస్తే ఇది 15 శాతం అధికం. నికర పేరోల్ జమల్లో మహిళల సంఖ్య 4.72 లక్షలుగా నమోదైంది. రాష్ట్రాలవారీగా పేరోల్ గణాంకాలు చూస్తే 20 శాతంతో మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలవగా.. తెలంగాణ, తమిళనాడు, గుజరాత్, ఉత్తరప్రదేశ్ తదితరాలు 5 శాతం చొప్పున వాటా ఆక్రమించాయి.

# భవిష్యత్ ఇంధనం గురించి చెప్పిన గడ్కరీ

**ఈ20 ఫ్యూయెల్ చుట్టూ ఉన్న గందరగోళాల మధ్య.. 'హైడ్రోజన్' భవిష్యత్ ఇంధనం అని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. హైడ్రోజన్, బయో ఇంధనాలు & ఎలక్ట్రిక్ వాహనాలు రవాణా.. పరిశ్రమల భవిష్యత్తు అని ఆయన స్పష్టం చేశారు.**



శిలాజ ఇంధనాలను హైడ్రోజన్ భర్తీ చేస్తుంది. ఇది కేవలం రవాణాకు మాత్రమే కాకుండా.. పరిశ్రమలకు కూడా కీలకంగా మారుతుందని గడ్కరీ అన్నారు. రైళ్లు హైడ్రోజన్ ద్వారానే నడుస్తాయి, విమానాలు హైడ్రోజన్‌తో ఎగురుతాయని అన్నారు. భవిష్యత్తులో శిలాజ ఇంధనాలపై ఆధారపడటం ఉండదని పేర్కొన్నారు.

**ఆటోమొబైల్ మార్కెట్లో భారత్**

ప్రపంచ ఆటోమొబైల్ మార్కెట్లో భారతదేశం ఎదుగుదలను నితిన్ గడ్కరీ ప్రస్తావించారు. ఇండియా ఇటీవల జపాన్‌ను అధిగమించి దేశం ఏడవ స్థానం నుంచి మూడవ స్థానానికి చేరుకుందని అన్నారు. అమెరికన్ ఆటోమొబైల్ పరిశ్రమ విలువ రూ. 78 లక్షల కోట్లు, చైనా విలువ రూ. 49 లక్షల కోట్లు, కాగా భారతదేశం విలువ రూ. 22 లక్షల కోట్లు. రాబోయి రోజుల్లో ఆటోమొబైల్ రంగంలో భారత్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.

కొన్ని రోజుల క్రితం, మెర్సిడెస్ గ్లోబల్ చైర్మన్.. భారతదేశంలో ఎలక్ట్రిక్ మెర్సిడెస్ కార్లను తయారు చేస్తామని నాకు చెప్పారని నితిన్ గడ్కరీ చెప్పారు. రవాణా & పరిశ్రమ భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలు, బయో ఇంధనాలు, హైడ్రోజన్‌పై ఆధారపడి ఉంది. వీటి వల్ల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయి. పర్యావరణంలో కాలుష్యం కూడా తగ్గుతుందని ఆయన అన్నారు. ఈ రంగంలో ఉద్యోగాలు కూడా పెరుగుతాయని చెప్పారు.

హైడ్రోజన్ ఇంధనం గురించి మాట్లాడుతూ.. చమురు ఉత్పత్తి చేసే దేశాలను చౌకైన హైడ్రోజన్‌తో భారతదేశం సమం చేయగలదని గడ్కరీ అన్నారు. హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చును తగ్గించగలిగితే.. భారతదేశం ఇంధన దిగుమతిదారు నుంచి ప్రపంచ ఎగుమతిదారుగా మారగలదని అన్నారు. అయితే హైడ్రోజన్ ఫిల్లింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.



## లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

గురువారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 142.87 పాయింట్లు లేదా 0.17 శాతం లాభంతో.. 82,000.71 వద్ద, నిఫ్టీ 33.20 పాయింట్లు లేదా 0.13 శాతం లాభంతో 25,083.75 వద్ద నిలిచాయి. ఇజ్మో లిమిటెడ్, డీపీ వైర్స్, కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్, బీఎఫ్ యుటిలిటీస్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. యూవై ఫిన్‌కార్ప్, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, హింద్ రెక్టిఫైయర్స్, బీఎస్ఈ లిమిటెడ్, మాస్టర్ ట్రస్ట్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో నిలిచాయి.

# మొన్న 300 మందికే.. ఇప్పుడు 999 మందికి



మహీంద్రా ఇటీవల వార్నర్ బ్రదర్స్ సహకారంతో రూ. 27.79 లక్షల (ఎక్స్-షోరూమ్) ధరతో బీఈ 6 బ్యాట్‌మ్యాన్ ఎడిషన్‌ను లాంచ్ చేసింది. లాంచ్ సమయంలో కేవలం 300 యూనిట్లకు మాత్రమే పరిమితమైన ఈ ఎడిషన్ ఇప్పుడు 999 యూనిట్లకు చేరింది. అంటే దీనిని 999 మంది కొనుగోలు చేయగలరు.

మహీంద్రా బీఈ 6 బ్యాట్‌మ్యాన్ ఎడిషన్ ఆగస్టు 21 సాయంత్రం 5 గంటల నుంచి మహీంద్రా అధికారిక వెబ్‌సైట్లో ఉంచింది. కాగా కంపెనీ ఈ మోడల్ కోసం ఆగస్టు 23 నుంచి బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించనుంది. డెలివరీలు సెప్టెంబర్ 20న ప్రారంభం కానున్నాయి.

మహీంద్రా బీఈ 6 బ్యాట్‌మ్యాన్ ఎడిషన్.. కస్టమ్ శాటిన్ బ్లాక్ బాడీ కలర్‌తో వస్తుంది. ముందు డోర్స్ మీద బ్యాట్‌మ్యాన్ డెకాల్స్, టెయిల్‌గేట్‌పై డార్క్ నైట్ బ్యాడ్జ్, ఫెండర్‌పై బ్యాట్‌మ్యాన్ లోగో, బంపర్ & రివర్స్ లాంప్ ఉన్నాయి. బ్రేక్‌లు, స్ప్రింగ్‌లు ఆల్కెమీ గోల్డ్ పెయింట్ పొందాయి. ఇది చూడగానే ఒక సూపర్ హీరోను గుర్తుకు తెస్తుంది.

మహీంద్రా బ్యాట్‌మ్యాన్ ఎడిషన్.. 79 kWh బ్యాటరీ ప్యాక్‌తో.. ఒకే ఫుల్ ఛార్జ్‌పై 682 కి.మీ రేంజ్ అందిస్తుంది. ఇందులోని ఎలక్ట్రిక్ మోటారు 286 హార్స్ పవర్, 380 న్యూటన్ మీటర్ టార్క్ ఉత్పత్తి చేస్తాయి. పనితీరు పరంగా ఉత్తమంగా ఉంటుందని సమాచారం.మహీంద్రా బీఈ 6 బ్యాట్‌మ్యాన్ ఎడిషన్ లోపల కూడా అద్భుతమైన ఇంటీరియర్ డిజైన్ పొందుతుంది. డాష్‌బోర్డ్‌పై ఆల్కెమీ గోల్డ్‌లో నంబర్ ఉన్న బ్యాట్‌మ్యాన్ ఎడిషన్ ప్లేక్, ఇన్‌స్ట్రుమెంట్ ప్యానెల్ కోసం చార్‌కోల్ లెదర్ & గోల్డ్ సెపియా స్టిచింగ్‌తో కూడిన స్వెడ్ లెదర్ అపోల్‌స్ట్రే వంటివి ఉన్నాయి. గోల్డ్ యాక్సెంట్‌లు స్టీరింగ్ వీల్, ఇన్ టచ్ కంట్రోలర్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ వరకు విస్తరించి ఉండగా, బ్యాట్ లోగో బూస్ట్ బటన్, సీట్లు మొదలైనవాటిపై కనిపిస్తాయి.

# హైదరాబాద్‌లో జీసీసీల జోరు



**వరుస కడుతున్న అగ్రశ్రేణి విదేశీ కంపెనీలు**

**హైదరాబాద్:** అగ్రశ్రేణి బహుళ జాతి కంపెనీలకు చెందిన జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)లను ఆకర్షించటంలో హైదరాబాద్ జోరు కొనసాగుతోంది. రోజురోజుకీ కొత్త కంపెనీలు ఇక్కడ కొలువుదీరుతున్నాయి. ఇందులో ఆర్థిక సేవలు, జీవశాస్త్రాల విభాగానికి చెందిన కంపెనీలు ఎక్కువగా ఉండటం ప్రత్యేకత. గత కొద్ది వారాల్లోనే అమెరికా, ఆస్ట్రేలియా, ఐరోపా దేశాలకు చెందిన కంపెనీలు తమ జీసీసీలను ఇక్కడ ఏర్పాటు చేశాయి. యూఎస్‌కు చెందిన సంపద నిర్వహణ, ఆర్థిక సేవల సంస్థ అమెరిప్రైస్ ఫైనాన్షియల్, అమెరికాకే చెందిన డెయిరీ, పశుపోషక ఉత్పత్తుల సంస్థ లాండ్‌ఓలేక్స్, ఆటోమోటివ్ సర్వీసెస్ సంస్థ హాల్‌మ్యాన్ హైదరాబాద్‌లో తమ తమ జీసీసీలను ప్రారంభించాయి. ఆస్ట్రేలియాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ మెక్వారీ గ్రూపు, జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ స్టాక్ ఎక్స్ఛేంజీని నిర్వహించే సంస్థ అయిన డాయిష్‌బోర్స్ సైతం హైదరాబాద్‌లో జీసీసీ కేంద్రాలను ఇటీవల ఏర్పాటు చేశాయి.

**ఆకర్షణ ఎందుకంటే..:** జీవ శాస్త్రాలు, ఫార్మా రంగానికి చెందిన బహుళ జాతి కంపెనీలు ఇప్పటికే ఇక్కడ తమ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. అగ్రగామి 10 ఫార్మా కంపెనీల్లో ఎనిమిది కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలు నెలకొల్పాయి. ఇందులో ఎలీ లిల్లీ, నొవార్టిస్, బీఎంఎస్ (బ్రిస్టల్ మేర్స్ స్క్విబ్), సనోఫి, రోష్, ఆమ్‌జెన్, బేయర్, ఎంఎస్‌డీ (మెర్క్) ఉన్నాయి. ఇవే కాకుండా హెల్త్‌కేర్ సేవల సంస్థ అయిన ఎవర్‌నార్త్, ప్రపంచంలోని అతిపెద్ద యానిమల్ హెల్త్ కంపెనీ అయిన జోటిస్ తమ పరిశోధనా కేంద్రాలను ఇక్కడ నిర్వహిస్తున్న విషయం గమనార్హం. స్థానికంగా ఫార్మా, బయోటెక్ పరిశ్రమ విస్తరించటం, ఐటీ సైన్స్ తెలిసిన మానవ వనరుల లభ్యతను దృష్టిలో పెట్టుకొని ఆయా విభాగాలకు చెందిన కంపెనీలు జీసీసీలను ఏర్పాటు చేయటానికి హైదరాబాద్ నగరాన్ని ఎంచుకుంటున్నాయని పరిశ్రమ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికి తోడు రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు, ఎంతో మెరుగైన మౌలిక సదుపాయాలు కూడా దీనికి దోహదపడుతున్నాయి.

**బెంగళూరుకు గట్టిపోటీ**

రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సేవల సంస్థ అయిన 'వెస్టియన్' తాజా నివేదిక ప్రకారం కొత్త జీసీసీలను ఆకర్షించటంలో బెంగళూరు నగరానికి హైదరాబాద్ గట్టి పోటీ ఇస్తోంది. ప్రస్తుతం మనదేశంలో 1700 జీసీసీలు ఉండగా, ఇందులో బెంగళూరులో 487 కేంద్రాలు, హైదరాబాద్‌లో 273 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. చెన్నై, దిల్లీ ఎన్‌సీఆర్, ముంబయి నగరాలు తదుపరి స్థానాల్లో కనిపిస్తున్నాయి. మన దేశంలో 2028 నాటికి జీసీసీల సంఖ్య 2100కు పెరుగుతుందని అంచనా. ఇందులో కొత్తగా ఏర్పాటయ్యే కేంద్రాలను హైదరాబాద్ అధికంగా ఆకర్షిస్తుందని స్థానిక ప్రభుత్వ, పరిశ్రమ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

# 'పరదా' రివ్యూ.. అమ్మాయిలు తప్పకుండా చూడాలి!



**'రివ్యూలు నచ్చితేనే మా సినిమా చూడండి'.. రీసెంట్‌గా ప్రమోషన్లలో హీరోయిన్ అనుపమ చెప్పిన మాట ఇది. చాలా నమ్మకంతో ఆగస్టు 22న రిలీజ్ పెట్టుకుని, రెండు రోజుల ముందే ప్రీమియర్లు వేశారు. ఆ చిత్రమే 'పరదా'. లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్‌తో తీసిన ఈ మూవీలో అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్ర పోషించింది. సంగీత, మలయాళ నటి దర్శన రాజేంద్రన్ ఇతర కీలక పాత్రలు పోషించారు. మరి ఈ సినిమా ఎలా ఉంది? ఏంటనేది రివ్యూలో చూద్దాం.**

**కథేంటి?**

పడతి అనే గ్రామంలో ఈడుకొచ్చిన ప్రతి ఆడపిల్ల ముఖానికి పరదా కప్పుకొని తిరుగుతుంటుంది. దానికి ఓ కారణం ఉంటుంది. పొరపాటున ఎవరైనా పరదా తీస్తే వాళ్లు.. గ్రామ దేవత జ్వాలమ్మకు ఆత్మాహుతి ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఇదే ఊరిలో ఉండే సుబ్బు(అనుపమ), రాజేశ్ (రాగ్ మయూర్) ప్రేమలో ఉంటారు. వీళ్లకీ పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయిస్తారు. సరిగ్గా నిశ్చితార్థం రోజున సుబ్బు ఫొటో కారణంగా.. ఈమె ఆత్మాహుతి చేసుకోవాలని ఊరి పెద్దలు నిర్ణయం తీసుకుంటారు. తన తప్పు లేదని చెబుతున్నా సరే వినరు. దీంతో అనుకోని పరిస్థితుల మధ్య సుబ్బు తన ఊరి దాటి ధర్మశాల వెళ్లాల్సి వస్తుంది. ఈమెకు తోడుగా రత్న(సంగీత), అమిష్ట(దర్శన రాజేంద్రన్) కూడా వెళ్తారు. ఇంతకీ ధర్మశాల ఎందుకు వెళ్లారు? చివరకు సుబ్బు.. పరదా తీసిందా లేదా అనేది మిగతా స్టోరీ.

**ఎలా ఉందంటే?**

గత కొన్నాళ్లలో హీరో సెంట్రిక్ మూవీస్ ఎక్కువగా వస్తున్నాయి. అయితే హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీస్ కాస్త తగ్గాయని చెప్పొచ్చు. ఆ లోటుని భర్తీ చేసేందుకు వచ్చిన చిత్రమే 'పరదా'. ఇందులో హీరోహీరోయిన్లు అంటూ ఎవరూ ఉండరు. కథే మెయిన్ హీరో.

పడతి గ్రామంలో జ్వాలమ్మ జాతరతో సినిమా మొదలవుతుంది. ఈ ఊరిలోని ఈడొచ్చిన అమ్మాయిలు, మహిళలు ఎందుకు పరదా కప్పుకోవాల్సి వచ్చిందనేది మొదటి పది నిమిషాల్లోనే తోలుబొమ్మలాట కథతో చెప్పేస్తారు. తర్వాత సుబ్బు, రాజేశ్ ప్రేమ.. నిశ్చితార్థం.. అనుకోని అవాంతరం వల్ల అది ఆగిపోవడం.. ఇలా కథలో సంఘర్షణ ఏర్పడుతుంది. తన తప్పు లేదని చెబుతున్నా సరే సుబ్బుని ఆత్మాహుతి చేసుకోవాలని ఊరి పెద్దలు ఆదేశించడం.. తర్వాత అనుకోని పరిస్థితుల్లో సుబ్బు.. మరో ఇద్దరు మహిళలతో కలిసి హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల వెళ్లాల్సి రావడం జరుగుతుంది. తర్వాత ఏమైంది? ఈ ప్రయాణంలో ఏం తెలుసుకున్నారనేది తెలియాలంటే మూవీ చూడాలి. ఒకప్పటితో పోలిస్తే అమ్మాయిల్లో చైతన్యం పెరిగింది. మగాళ్లకు ఏ మాత్రం తీసిపోకుండా భిన్న రంగాల్లో రాణిస్తున్నారు. అయినా సరే కొన్ని ప్రాంతాల్లో మూఢ నమ్మకాల పేరుతో మహిళలని ఇబ్బంది పెడుతున్నారు. ఆచారం, సంప్రదాయం అని చెప్పి బయట ప్రపంచం చూడనీయకుండా చేస్తున్నారు. అలాంటి ఓ ఊరికి చెందిన అమ్మాయి.. తన ప్రాణాల్ని పణంగా పెట్టి మరీ ఎలాంటి సాహసం చేసింది? మూఢనమ్మకాలపై ఎలా పోరాడింది అనే కల్పిత కథతో తీసిన చిత్రమే ఇది.

సినిమా ప్రారంభంలో జెయింట్ వీల్ ఎక్కడానికే సుబ్బు చాలా భయపడుతుంది. కానీ పరిస్థితుల కారణంగా ఎత్తయిన ఎవరెస్ట్ వరకు వెళ్తుంది. తనలో భయాన్ని పోగొట్టుకుంటుంది. మూవీ అంతా సుబ్బు పాత్ర పరదా కప్పుకొని ఉంటుంది. ఆమె పూర్తిగా పరదా తీసేసే సీన్‌లో సీతాకోక చిలుక రిఫరెన్స్ మంచి ఇంపాక్ట్ ఇచ్చింది. సుబ్బుతో పాటు జర్నీ చేసే రత్న ఓ గృహిణి, అమిష్ట ఓ ఇంజినీర్. ఈ పాత్రల్ని ప్రారంభించిన తీరు, ముగించిన తీరు కూడా మెచ్చుకునేలా ఉంటుంది. సెకండాఫ్ మొదలవగానే రాజేంద్ర ప్రసాద్ క్యారెక్టర్ వస్తుంది. ఉన్నది కాసేపే అయినా.. ఆయన చెప్పే ఓ స్టోరీ, డైలాగ్స్ మంచి ఎమోషనల్‌గా అనిపిస్తాయి. క్లైమాక్స్‌లో సుబ్బు పాత్ర.. దేవుడికి కట్టిన వస్త్రాల్ని తగలబెట్టే సీన్, ఊరి ప్రజల కళ్లు తెరిపించింది అనేలా విజువల్‌గా చూపించడం బాగుంది.

## టాలీవుడ్ సమ్మెకు ఎండ్ కార్డ్.. రేపటి నుంచి



**టాలీవుడ్ ఫిల్మ్ ఛాంబర్, ఫిల్మ్ వర్కర్క్ ఫెడరేషన్ మధ్య జరుగుతున్న వివాదానికి పుల్‌స్టాప్ పడింది. ఇవాళ జరిగిన చర్చలు సఫలం కావడంతో రేపటి నుంచి యథావిధిగా సినిమా షూటింగ్స్ ప్రారంభం కానున్నాయి. దాదాపు 18 రోజుల తర్వాత టాలీవుడ్‌లో షూటింగుల సందడి మొదలు కానుంది. లేబర్ కమిషనర్ మధ్యవర్తిత్వంతో చర్చలు ఫలించినట్లు తెలుస్తోంది.**

**కాగా.. కొన్ని రోజులుగా తమ వేతనాలు ముప్పై శాతం పెంచాలంటూ సినీ కార్మికులు సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో గత 16 రోజులుగా తెలుగు సినిమాల షూటింగ్స్ అన్ని ఆగిపోయాయి. ఇప్పటికే ఈ సమస్యల పరిష్కారం కోసం ఫిల్మ్ చాంబర్ అటు నిర్మాతలతో, ఇటు కార్మికులతో చర్చలు జరిపింది. కార్మికులు కోరినట్లుగా 30 శాతం జీతాలు పెంచేందుకు నిర్మాతలు ఒప్పుకోవట్లేదు. కార్మికులు సైతం మొట్టు దిగడం లేదు. పలు దఫాల చర్చల అనంతరం తాము పెట్టిన కండీషన్లకు ఒప్పుకుంటే రూ. 2 వేలలోపు జీతాలు ఉన్న వారికి పర్సంటేజీల ప్రకారం పెంచుతామని నిర్మాతలు ప్రకటించారు. ఇందుకు కార్మికులు విముఖత వ్యక్తం చేశారు. తాజాగా వీటిపై చర్చలు సఫలం కావడంతో రేపటి నుంచి షూటింగ్స్ షురూ కానున్నట్లు తెలుస్తోంది.**

## చిరంజీవి 'విశ్వంభర' గ్లింప్స్ రిలీజ్.. ఖుషీలో ఫ్యాన్స్




**మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న అడ్వెంచర్ మూవీ విశ్వంభర . బింబిసార ఫేమ్ మల్లిడి వశిష్ట దర్శకత్వం వహించారు. త్రిష కథానాయికగా నటించగా ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రలు పోషించారు. రేపు (ఆగస్టు 22) చిరంజీవి బర్త్‌డే సందర్భంగా విశ్వంభర గ్లింప్స్ వదిలారు. వచ్చే ఏడాది రిలీజ్**

**సినిమా విషయానికి వస్తే.. విశ్వంభర ఈ ఏడాది జనవరిలోనే రిలీజవ్వాల్సింది. కానీ, వీఎఫ్‌ఎక్స్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉండటంతో వాయిదా పడుతూ వస్తోంది. ఈ ఏడాదిలో సినిమా రావడం కష్టమేనని స్వయంగా మెగాస్టారే వెల్లడించారు. 2026 సమ్మర్‌లో విశ్వంభర ప్రేక్షకుల ముందుకు వస్తుందని ప్రకటించారు. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మిస్తున్నారు. ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు.**



## చెత్త ఎఫైర్లు పెట్టుకున్నా.. మగ తోడు అవసరం లేదు : సీనియర్ హీరోయిన్

బాలీవుడ్‌లో కొన్నేళ్ల పాటు నెం1 అందాల నటిగా యువ ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించింది మనీషా కొయిరాలా. సుభాష్ ఘయ్ తీసిన 1942 ఎ లవ్ స్టోరీ సినిమా, అందులోని పాటల్లో మనీషా కొయిరాలా అందాన్ని మర్చిపోవడం అంత తేలిక కాదు అంటారు బాలీవుడ్ సినీ ప్రేమికులు. నాగార్జున సరసన క్రిమినల్ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకూ దగ్గరైంది ఈ నేపాలీ సుందరి. అద్భుతమైన విజయాలను చవిచూసినా, విధి ఆమె పట్ల చిన్న చూపు చూడడంతో క్యాన్సర్ బారిన పడింది. దాంతో ఆమె జీవితం పూర్తిగా తల్లకిందులైంది. ప్రస్తుతం క్యాన్సర్ నుంచి కోలుకుని ఇప్పుడిప్పుడే తన వయసుకు తగిన పాత్రలతో తిరిగి బాలీవుడ్‌లో రాణించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మనీషా.. పలు విషయాలను పంచుకుంది.

అందాల నటిగా తెరపై గ్లామర్‌ను గుబాళింపజేసిన మనీషా బాలీవుడ్‌లో అనేక అఫైర్స్ వార్తలకు కూడా కేరాఫ్‌గా నిలిచింది. 'అగ్ని సాక్షి' (1996) సినిమాలో కలిసి నటించినప్పుడు సహ నటుడైన నానా పటేకర్‌తో సంబంధం ఏర్పడింది. అప్పటికే పెళ్లయిన నానా పటేకర్ ప్రతీ తెల్లవారుఝామున మనీషా ఇంటి నుంచి తిరిగి రావడం అనేకమార్లు వెలుగులోకి వచ్చింది. అదే విధంగా సౌదాగర్ లో నటించిన వివేక్ ముష్రాన్‌తోనూ ఆమెకు సంబంధం ఉందని వార్తలు గుప్పుమన్నాయి.

ఇక మార్కెట్ సినిమా సమయంలో కెరీర్ పరంగా ఇబ్బందులు ఎదుర్కుంటున్న మనీషా కి ఆర్యన్ వేద్ ప్రేమ ఓదార్చింది.. సినిమా రంగంలో మాత్రమే కాదు సినీయేతర రంగాల వారితో కూడా ఆమె సంబంధాలు అప్పట్లో బాగా వెలుగు చూశాయి. నానా పటేకర్‌తో బ్రేకప్ బాధలో ఉండగా, హుస్సేన్ బాబాయ్‌గా పేరొందిన డిజె హుస్సేన్, నేపాల్‌లోని ఆస్ట్రేలియన్ అంబాసిడర్ క్రిస్పిన్ కొన్‌రాయ్, లండన్‌కు చెందిన నైజీరియన్ వ్యాపారి సిసిల్ ఆంథోనీ, అమెరికన్ స్పోర్ట్స్ కౌన్సిలర్ క్రిస్టోఫర్ డోరిస్... ఇలా పలువురితో ఆమె సంబంధాలు పెట్టుకుందని అప్పట్లో వెల్లడైంది. వీటన్నింటినీ వదిలించుకుని నేపాల్‌కు చెందిన సామ్రాట్ దహాయ్‌ని 2010లో పెళ్లి చేసుకుని కుటుంబ జీవితం ప్రారంభించినప్పటికీ ఆ బంధం కూడా రెండేళ్లోనే బెడిసి కొట్టింది.

క్యాన్సర్‌తో పోరాడిన తర్వాత మనిషా కోయిరాలా చాలా మారిపోయింది. ''ఆ వ్యాధి నాకు జీవితం విలువ తెలిసివచ్చేలా చేసింది, ఒక్క క్షణాన్ని కూడా వృధా చేసుకోకూడదని నేర్పింది. ఆ ఎదురుదెబ్బకు ముందు నేను అనేక చెత్త పనుల్లో, చెత్త సంబంధాల్లో చాలా సమయాన్ని వృధా చేసుకున్నాను,'' అని మనీషా ఆవేదన వ్యక్తం చేసింది.

ప్రస్తుతం తాను సింగిల్‌గా ఉన్నానని ఇలాగే ఉండాలని అనుకుంటున్నానని ఆమె అంటోంది. ''ఇకపై నేను నిరర్థకమైన సంబంధాలేవీ పెట్టుకోను. ఒంటరితనం నుంచి రక్షించడానికి ఎవరైనా మగవాడు రావాలని కూడా ఎదురు చూడను. నేను సింగిల్‌నే కానీ ఒంటరిగా లేను. ఇప్పుడు నా సహవాసాన్ని నేనే ఆస్వాదించడం మొదలుపెట్టాను. నాకు లాంగ్ ట్రెక్కింగ్‌లు చేయడం ఇష్టం. దీర్ఘ ధ్యాన విరామాలు తీసుకుంటాను. అయితే నాలాగా జీవనశైలిని మార్చుకోవడానికి ఏదో పెద్ద నష్టం, కష్టం వచ్చే వరకూ ఎదురు చూడవద్దు. ఇప్పుడే మార్చుకోండి'' అంటూ మనీషా తోటి మహిళలకు సలహా ఇస్తోంది. అనుభవం నేర్పిన పాఠాలతో ఒకనాటి సిల్వర్ స్క్రీన్ బ్యూటీ... భవిష్యత్తుని తీర్చిదిద్దుకుంటోంది. తన జీవితాన్ని ఓ పాఠంగా తీసుకోవాలని యువతులకు సూచిస్తోంది.

## అందుకే సినిమాలు తగ్గించాను: సమంత



**నటిగానే కాకుండా నిర్మాతగానూ సరికొత్త కథలను ప్రేక్షకులకు అందిస్తూ అగ్ర కథానాయిక సమంత ప్రశంసలు అందుకుంటున్నారు. తాజాగా ఈ బ్యూటీ ప్రముఖ మ్యాగజైన్ 'గ్రాజియా ఇండియా' లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజీపై మెరిసిన విషయం తెలిసిందే. ఆ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.**

ఎన్ని సినిమాలు చేశామనేది కాదని.. ఎంత మంచి చిత్రాలు తీశామనేది ముఖ్యమని సమంత చెప్పారు. 15 సంవత్సరాలుగా ఇండస్ట్రీలో తన ప్రత్యేకతను చాటుకుంటోన్న ఆమె ప్రస్తుతం సినిమాలతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ''గతంతో పోలిస్తే ఇప్పుడు నాలో ఎంతో మార్పు వచ్చింది. గొప్ప పనులు చేసే స్థాయికి చేరుకున్నాను. ఫిట్‌నెస్, సినిమాలు రెండిటిపైనా దృష్టిపెట్టాను. మంచి సినిమాలు, సిరీస్‌లలో భాగమయ్యాను. అవన్నీ కేవలం ప్యాషన్ కోసమో, గుర్తింపు కోసమో చేసేవి కావు. అన్నీ నా మనసుకు దగ్గరగా ఉన్న కథలే''
''తక్కువ ప్రాజెక్ట్‌లు చేయాలని నిర్ణయించుకున్నా. శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నా. ఇకపై ఒకేసారి ఐదు సినిమాలు చేయను. నా శరీరం చెప్పేది వినాలని తెలుసుకున్నా. అందుకే పనిని తగ్గించుకున్నా. కానీ, తక్కువ చేసినప్పటికీ ప్రేక్షకుల మనసుకు నచ్చే వాటితోనే పలకరిస్తాను. ప్రాజెక్ట్‌ల సంఖ్య తగ్గింది.. కానీ, వాటి నాణ్యత కచ్చితంగా పెరుగుతుంది'' అని చెప్పారు.

ఇక సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే సమంత అందులో వచ్చే ప్రశంసలతో పాటు విమర్శలను కూడా స్వీకరించగలగాలని తెలిపారు. ''నేను సామాజిక మాధ్యమాల్లో సాధ్యమైనంత వరకు వాస్తవంగా ఉండడానికి ప్రయత్నిస్తాను. కామెంట్స్‌లో వచ్చే ప్రశంసలకు ఎలా ఆనందిస్తామో.. ట్రోలింగ్, నెగెటివ్ కామెంట్స్‌ను కూడా అంతే హుందాగా స్వీకరించగలగాలి. మీరు దాన్ని కంట్రోల్ చేయగలగాలి కానీ, అది మీ జీవితాన్ని పూర్తిగా నియంత్రించకూడదు'' అని తెలిపారు.

ప్రస్తుతం సమంత 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' లో నటిస్తున్నారు. దర్శకద్వయం రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్, సమంతతో పాటు అలీ ఫజల్ కీలకపాత్రలో నటిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా ఇది రూపొందుతోంది.

## తిరుమలలో నాగచైతన్య దంపతులు.. ఫొటోలు వైరల్

**అక్కినేని జంట నాగచైతన్య-శోభిత.. తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో చైతూ-శోభిత.. స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగ నాయకుల మండపంలో నాగచైతన్య దంపతులని పండితులు ఆశీర్వదించారు. ఈ క్రమంలో ఫొటోలు వైరల్ అవుతున్నాయి.**

**కెరీర్ విషయానికొస్తే నాగచైతన్య.. ఈ ఏడాది 'తండేల్'తో హిట్ కొట్టాడు. ప్రస్తుతం కార్తిక్ వర్మ దర్శకత్వంలో ఓ సూపర్ నేచురల్ హారర్ మూవీ చేస్తున్నాడు. ఇది కాకుండా కొరటాల శివతోనూ కొత్త సినిమా చేయబోతున్నాడని గత కొన్నిరోజులుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. మరోవైపు శోభిత మాత్రం పెళ్లి తర్వాత కొత్త చిత్రాల్లో నటిస్తున్నట్లు లేదు. చాలారోజుల తర్వాత వీళ్లు మరోసారి జంటగా కనిపించడంతో అభిమానులు ఆనందపడిపోతున్నారు.**





## రంజీ ట్రోఫీ ఆడేందుకు సిద్ధమవుతున్న ఛతేశ్వర్ పుజారా

రంజీ ట్రోఫీ 202526 అక్టోబర్‌లో ప్రారంభం కానుంది. టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా సౌరాష్ట్ర తరఫున రంజీ ట్రోఫీ ఆడనున్నాడు. ఈ విషయాన్ని సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ధ్రువీకరించింది. పుజారా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఎస్‌సీఏ సీనియర్ అధికారి ఒకరు స్వాగతించారు. పుజారా అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని అతడు అభిప్రాయపడ్డాడు.

అజింక్య రహానే తాను ముంబయి కెప్టెన్సీని వదులుకున్నాడన్న వార్త వెలువడిన కొన్ని గంటలకే.. పుజారా రంజీట్రోఫీలో పాల్గొనబోతున్నాడన్న విషయం బయటకు వచ్చింది. ప్రస్తుతం ఛతేశ్వర్ పుజారా, అజింక్య రహానే ఇద్దరూ టీమ్ఇండియాకు దూరంగా ఉన్నారు. పుజారా చివరిసారిగా జూన్ 2023లో జరిగిన వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌లో కనిపించాడు. రహానే ఆఖరు సారిగా జులై 2023లో వెస్టిండీస్‌తో టీమ్ఇండియాకు జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఆడాడు.

రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ సుదీర్ఘ ఫార్మాట్‌కు తమ రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత కూడా పుజారా, రహానేకు జట్టు నుంచి పిలుపు రాలేదు. వారికి బదులుగా టీమ్‌లోకి సాయి సుదర్శన్ , కరుణ్ నాయర్‌ను తీసుకున్నారు. అయితే తాను ఆశలు వదులుకోవట్లేదని.. టీమ్ఇండియాకు మళ్లీ ఆడేందుకు ప్రయత్నిస్తానని కొంతకాలం క్రితం పుజారా ఓ ఇంటర్వ్యూలో అన్నాడు. 'నాకు సాధ్యమైనంత వరకు నేను క్రికెట్ ఆడుతూనే ఉంటాను. నాకు క్రికెట్ అంటే ప్రాణం. నా రిథమ్, ఫిట్‌నెస్‌ను కాపాడుకొనేందుకు నేను చాలా కష్టపడుతున్నా. దేశవాళీలో కానీ, జాతీయ జట్టులో కానీ.. ఎప్పుడు అవకాశం వచ్చినా, నేను ఆడటానికి సిద్ధంగా ఉంటా' అని పుజారా అన్నాడు.

గత రంజీ ట్రోఫీ సీజన్‌లో పుజారా ఏడు మ్యాచ్‌లు ఆడి 402 పరుగులు సాధించాడు. టీమ్ఇండియా తరఫున 103 టెస్ట్ మ్యాచుల్లో 7,195 పరుగులు చేశాడు. ఇందులో 19 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలున్నాయి.




## ఆనంద్ X కాస్పరోవ్ , గుకేశ్ X కార్ల్‌సన్

**అక్టోబర్‌లో దిగ్గజాల మధ్య చెస్ పోరు**

**న్యూఢిల్లీ: ఇద్దరు చదరంగ దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, గ్యారీ కాస్పరోవ్ మరోసారి ముఖాముఖిగా తలపడేందుకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్‌లో అమెరికాలోని సెయింట్ లూయిస్ వేదికగా జరగనున్న క్లచ్ చెస్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌ల్లో ఈ దిగ్గజాలు ఎత్తులు పైఎత్తులు వేయనున్నారు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్, ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) మధ్య కూడా గేమ్‌లు జరగనున్నాయి.**

ప్రపంచ చదరంగంలో అత్యుత్తమ ఆటగాళ్లుగా గుర్తింపు సాధించిన ఆనంద్, కాస్పరోవ్ మధ్య ఇప్పటి వరకు 82 గేమ్‌లు జరిగాయి. చివరిసారిగా 2021లో క్రొయేషియా ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్‌లో ఈ ఇద్దరు తలపడగా... భారత గ్రాండ్‌మాస్టర్ విజయం సాధించాడు. 'ఇద్దరు ప్రపంచ మాజీ చాంపియన్‌లు గ్యారీ కాస్పరోవ్, విశ్వనాథన్ ఆనంద్... క్లచ్ చెస్ (లెజెండ్స్) ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో తలపడనున్నారు. అక్టోబర్ 7 నుంచి 11 మధ్య ఈ టోర్నీ జరగనుంది. తరానికి ఒక్కసారి జరిగే మ్యాచ్ ఇది' అని సెయింట్ లూయిస్ క్లబ్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఈ టోర్నీ ప్రైజ్‌మనీ రూ. 1 కోటీ 25 లక్షలు కాగా... ఇద్దరు దిగ్గజాల మధ్య 12 గేమ్‌లు నిర్వహించనున్నారు. ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. ఇక ఇదే వేదికపై అక్టోబర్ 27 నుంచి 29 వరకు ప్రస్తుత అగ్రశ్రేణి ఆటగాళ్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్, రెండో ర్యాంకర్ నకముర, మూడో ర్యాంకర్ ఫాబియానో కరువానా, ప్రపంచ స్టార్ గుకేశ్ తదితరులు పాల్గొననున్నారు. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన వారికి భారీ ప్రైజ్‌మనీ దక్కనుంది. 'ఈ టోర్నీ ప్రైజ్‌మనీ రూ. 3 కోట్ల 58 లక్షలు. దీంతో పాటు ప్లేయర్లకు ప్రతిరోజు బోనస్, విజేతకు జాక్‌పాట్ వంటి ఎన్నో ఇతర ప్రయోజనాలు ఉంటాయి' అని నిర్వాహకులు తెలిపారు. డబుల్ రౌండ్ రాబిన్ పద్ధతిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో 18 గేమ్‌లు జరుగుతాయి.




# విరాట్ నుంచి ఆ రెండు రికార్డులకు ముప్పు తప్పినట్లే..!



**క్రికెట్‌లో రికార్డుల రారాజు ఎవరంటే ఠక్కున గుర్తుకొచ్చే పేరు విరాట్ కోహ్లి. ఈ బ్యాటింగ్ దిగ్గజం మరో బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన ఎన్నో రికార్డులను బద్దలు కొట్టి రికార్డుల రారాజుగా పేరు తెచ్చుకున్నాడు. అయితే ఈ బిరుదుకు పూర్తి న్యాయం జరగాలంటే విరాట్ మరో రెండు భారీ రికార్డులు బద్దలు కొట్టాల్సి ఉంది.**

అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇది సాధ్యపడేలా కనిపించడం లేదు. ఎందుకుంటే, విరాట్ ఇదివరకే టీ20, టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. తాజాగా విరాట్ వన్డే రిటైర్మెంట్‌పై కూడా ఊహాగానాలు ఎక్కువయ్యాయి. పైగా అతడి వయసు కూడా పైబడుతుంది.

ఈ పరిస్థితుల్లో విరాట్ సచిన్ ఖాతాలో ఉన్న ఆ రెండు భారీ రికార్డులను బద్దలు కొట్టడం దాదాపుగా అసాధ్యమనే చెప్పాలి. ఆ రికార్డులకు విరాట్ నుంచి ముప్పు తప్పినట్లే అనుకోవాలి. ఇంతకీ ఆ రెండు రికార్డులు ఏవంటే.. మొదటిది వన్డేల్లో అత్యధిక పరుగుల రికార్డు. రెండవది అంతర్జాతీయ క్రికెట్‌లో సెంచరీ సెంచరీల రికార్డు.

ప్రస్తుతం ఈ రెండు రికార్డులు విరాట్ కనుచూపుమేరల్లో కూడా లేవు. నాలుగైదేళ్ల కిందట ఈ రికార్డులను విరాట్ సులువుగా బద్దలు కొడతాడని అనిపించింది. అయితే గత కొంతకాలంగా విరాట్ నెమ్మదిపడటంతో ఈ రికార్డులు పరిధి దాటిపోయాయి. విరాట్‌కు వీటికి దూరం పెరిగిపోయింది.

ప్రస్తుత పరిస్థితులు చూస్తే ఈ రికార్డులు అందని ద్రాక్షల్లా మిగిలిపోవడం ఖాయమని అనిపిస్తుంది. ఇదే జరిగితే ఆ రెండు భారీ రికార్డులు సచిన్ ఖాతాలోనే సేఫ్‌గా ఉంటాయి. వాటిని సమీప భవిష్యత్తులో కూడా ఎవరూ బద్దలు కొట్టలేరు.

**వన్డేల్లో అత్యధిక పరుగులు**

సచిన్ ఖాతాలో ఉన్న ఈ రికార్డును (18426) చేరుకోవాలంటే విరాట్ మరో 4245 పరుగులు చేయాలి. విరాట్ వయసు దృష్ట్యా ఇది అసంభవమనే చెప్పాలి. ప్రస్తుతం విరాట్ ఖాతాలో 14181 పరుగులు ఉన్నాయి. మహా అయితే అతడు మరో 50 లేదా 60 వన్డేలు ఆడతాడు. ఈ మ్యాచ్‌ల్లో 4000 పైచిలుకు పరుగులు సాధించడం అసాధ్యం.

**100 సెంచరీలు**

ప్రపంచ క్రికెట్‌లో అసాధ్యంగా కనిపించే ఈ రికార్డును సచిన్ నెలకొల్పాడు. నాలుగైదేళ్ల కిందటి వరకు ఈ రికార్డును విరాట్ సాధిస్తాడనే నమ్మకముండేది. అయితే విరాట్ గత కొంతకాలంగా నెమ్మదించడంతో ఈ రికార్డుకు దూరం పెరిగింది. ప్రస్తుతం విరాట్ ఖాతాలో 82 సెంచరీలు ఉన్నాయి.

సచిన్ రికార్డును సమం చేయాలన్నా విరాట్ మరో 18 సెంచరీలు చేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది అసాధ్యమనే చెప్పాలి. ఈ లెక్కన పై రెండు రికార్డులు సచిన్ ఖాతాలోనే సేఫ్‌గా ఉంటాయి.

# మరింత ప్రాక్టీస్ కోసం...

**బ్రస్సెల్స్ డైమండ్ లీగ్ మీట్ నుంచి వైదొలిగిన నీరజ్ చోప్రా డైమండ్ లీగ్ ఫైనల్, ప్రపంచ చాంపియన్‌షిప్‌పై దృష్టి**

**న్యూఢిల్లీ:** భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా డైమండ్ లీగ్ (డీఎల్) చివరి అంచె పోటీల నుంచి తప్పుకున్నాడు. ఇప్పటికే డైమండ్ లీగ్ ఫైనల్‌కు అర్హత సాధించిన నీరజ్... ప్రధాన టోర్నీకి ముందు పూర్తి స్థాయిలో ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టాలనే ఉద్దేశంతో బెల్జియంలోని బ్రస్సెల్స్‌లో జరగనున్న మీట్ నుంచి తప్పుకున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పసిడి పతకం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన నీరజ్ చోప్రా... ఈ నెల 28న స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ వేదికగా జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్లో బరిలోకి దిగనున్నాడు.

ఒక సీజన్‌లో జావెలిన్ త్రో ఈవెంట్‌లో నాలుగు డైమండ్ లీగ్ అంచె పోటీలు జరగడం పరిపాటి కాగా... ఇందులో ప్రదర్శన ఆధారంగా అథ్లెట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. ఈ సీజన్‌లో నీరజ్ చోప్రా రెండు పోటీల్లోనే పాల్గొన్నా... మెరుగైన ప్రదర్శనతో ఫైనల్‌కు చేరాడు. ఇటీవల సిలెసియా టోర్నీ నుంచి సైతం నీరజ్ తప్పుకున్నాడు. 27 ఏళ్ల నీరజ్ చోప్రా ఈ సీజన్‌లో తొలిసారి 90 మీటర్ల మార్క్ అందుకున్నాడు. మే నెలలో జరిగిన దోహా డైమండ్ లీగ్ అంచె పోటీల్లో నీరజ్ జావెలిన్‌ను 90.23 మీటర్ల దూరం విసిరాడు.




అనంతరం జూన్‌లో పారిస్ డైమండ్ లీగ్‌లో నీరజ్ జావెలిన్‌ను 88.16 మీటర్ల దూరం విసిరి విజేతగా నిలిచాడు. శుక్రవారం జరగనున్న బ్రస్సెల్స్ అంచె పోటీల అనంతరం టాప్-6లో నిలిచిన త్రోయర్లు డైమండ్ లీగ్ ఫైనల్‌కు అర్హత సాధించనున్నారు. జూలై 5న భారత్‌లో నిర్వహించిన తొలి అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్ 'నీరజ్ చోప్రా క్లాసిక్' తర్వాత భారత స్టార్ తిరిగి బరిలోకి దిగలేదు. బెంగళూరు వేదికగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆ టోర్నీలో నీరజ్ జావెలిన్‌ను 86.18 మీటర్ల దూరం విసిరి టైటిల్ గెలుచుకున్నాడు.

ఓవరాల్‌గా ఈ సీజన్‌లో ఆరు పోటీల్లో పాల్గొన్న నీరజ్ అందులో నాలుగింట టైటిల్ సాధించడంతో పాటు మరో రెండు టోర్నీల్లో రెండో స్థానంలో నిలిచాడు. డైమండ్ లీగ్ ఫైనల్ అనంతరం వచ్చే నెల 13 నుంచి 21 వరకు టోక్యో వేదికగా ప్రపంచ చాంపియన్‌షిప్ జరగనుండగా... అందులో నీరజ్ డిఫెండింగ్ చాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకునేందుకు బరిలోకి దిగనున్నాడు.

**పెరిగిన ప్రైజ్‌మనీ...**

అథ్లెటిక్స్‌లో డైమండ్ లీగ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి ఏటా 14 అంచెల పోటీలు నిర్వహించిన అనంతరం అత్యుత్తమ ప్రదర్శన చేసిన అథ్లెట్లను ఫైనల్‌కు ఎంపిక చేస్తారు. ఇందులో మొత్తం 32 ఈవెంట్స్ జరుగుతాయి... వాటి విజేతలకు డైమండ్ ట్రోఫీతో పాటు... వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నేరుగా పాల్గొనేందుకు 'వైల్డ్ కార్డు' లభిస్తుంది. ఈ నెల 28న జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్ జావెలిన్ త్రో పోటీల్లో విజేతగా నిలిచిన అథ్లెట్‌కు రూ. 26.11 లక్షల ప్రైజ్‌మనీ సైతం లభించనుంది.

ఈ ఏడాది పురుషుల 100 మీటర్ల పరుగు, 1500 మీటర్ల పరుగు, 400 మీటర్ల పరుగు, పోల్‌వాల్ట్... మహిళల 100 మీటర్ల పరుగు, 100 మీటర్ల హర్డిల్స్, 3000 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్ల విజేతలకు మెరుగైన ప్రైజ్‌మనీ లభించనుంది. ఈ విభాగాల్లో విజేతగా నిలిచిన వారికి రూ. 43.52 లక్షలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ. 17.40 లక్షలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ. 8.70 లక్షలు దక్కనున్నాయి.

# సారథ్యం నుంచి రహానె నిష్క్రమణ.. యువ క్రికెటర్‌కు ఛాన్స్?

దేశవాళీ క్రికెట్‌లో ముంబయి జట్టును నడిపించిన అజింక్య రహానె సంచలన నిర్ణయం తీసుకున్నాడు. కెప్టెన్సీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు. మరికొద్ది రోజుల్లో దులీప్ ట్రోఫీ ప్రారంభం కానున్న నేపథ్యంలో రహానె నిర్ణయం అభిమానులను షాక్‌కు గురి చేసింది. అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైనప్పటికీ.. దేశవాళీలో అద్భుత ఫామ్‌తో కొనసాగుతున్నాడు. అయితే, జట్టుకు కొత్త కెప్టెన్‌ను నియమించాల్సిన అవసరం ఉందంటూ సోషల్ మీడియా వేదికగా రహానె పోస్టు పెట్టాడు.

"ముంబయి జట్టుకు నాయకత్వం వహించడం, ట్రోఫీలను గెలవడం ఎప్పటికీ మరిచిపోలేను. అదొక గొప్ప గౌరవం. కొత్త సీజన్‌లో జట్టుకు నూతన సారథ్యం అవసరమని భావిస్తున్నా. కొత్త నాయకత్వంలో ముంబయి జట్టు మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశిస్తున్నా. ప్లేయర్‌గా ఇంకా నా పూర్తిస్థాయి ప్రదర్శన ఇచ్చేందుకు నిరంతరం శ్రమిస్తా. ముంబయి క్రికెట్ అసోసియేషన్‌తో నా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది. మరిన్ని ట్రోఫీలు గెలిచేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాం. కొత్త సీజన్‌లో మరింత దూసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నా" అని పోస్టు పెట్టాడు.




37 ఏళ్ల రహానె నాయకత్వంలో ముంబయి అద్భుత విజయాలను నమోదు చేసింది. అదే సమయంలో కీలక మ్యాచుల్లోనూ తడబాటుకు గురైంది. ఇరానీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలను రహానె నాయకత్వంలో ముంబయి గెలుచుకుంది. రంజీట్రోఫీ (202324) ఫైనల్‌లో విదర్భ చేతిలో ఓటమిని చవిచూసింది. ఇప్పటి వరకు రహానె 201 ఫస్ట్‌క్లాస్ మ్యాచుల్లో 14వేలకుపైగా పరుగులు చేశాడు.

**యశస్వికా? శ్రేయస్‌కా?**

ముంబయి జట్టులో నాణ్యమైన ఆటగాళ్లకు కొదవేం లేదు. శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్, యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్ తదితర అంతర్జాతీయ క్రికెటర్లు ఉన్నారు. ఇప్పటికే శ్రేయస్, సూర్య ఐపీఎల్‌లో సారథ్యం చేపట్టిన అనుభవం ఉంది. టెస్టుల్లో యశస్వి జైస్వాల్ దూకుడు చూస్తూనే ఉన్నాం. వారిద్దరితో పోలిస్తే యశస్వి సుదీర్ఘ ఫార్మాట్‌లో మంచి ఇన్నింగ్స్‌లు నిర్మించగల సమర్థుడు. ఇటీవలే అతడు గోవా జట్టుకు ఆడదామనే ఆలోచనను కూడా విరమించుకున్నాడు. ఈ క్రమంలో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యశస్వికే జట్టు పగ్గాలు అప్పగించే అవకాశం లేకపోలేదు. శ్రేయస్ అయ్యర్ కూడా గట్టిపోటీదారే.

# ఒలింపిక్స్ కోసం బిడ్ వేయండి.. సహకరిస్తాం: భారత్‌కు ఆస్ట్రేలియా మద్దతు

**భారీ క్రీడా సమరాలను నిర్వహించేందుకు భారత ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ఒలింపిక్స్ 2036 నిర్వహణ కోసం భారత ప్రభుత్వం బిడ్ వేసేందుకు సిద్ధమైంది. మరికొన్ని రోజుల్లో బిడ్డింగ్ ప్రక్రియ మొదలుకానుంది. అహ్మదాబాద్ ప్రధాన కేంద్రంగా క్రీడల నిర్వహణ కోసం భారత్ ఏర్పాట్లు చేయనుంది. అయితే, ఈ విషయంలో ఏమైనా సహాయసహకారాలు అవసరమైతే అందించడానికి తాము సిద్ధమని ఆస్ట్రేలియా ప్రకటించింది. భారీ క్రీడా సంగ్రామం నిర్వహణలో నమ్మకమైన భాగస్వామిగా ఉంటామని హామీ ఇచ్చింది. దీనితో ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగవుతాయని వెల్లడించింది. ఈమేరకు ఆస్ట్రేలియా హై కమిషనర్ ఓ కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు.**



"ఆస్ట్రేలియా 2032 ఒలింపిక్స్‌ను నిర్వహించనుంది. మరోవైపు భారత్ ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్‌తో పాటు ఆసియా గేమ్స్ నిర్వహణ కోసం సిద్ధమవుతోంది. ఇరుదేశాల మధ్య దీనిపై చర్చలను విస్తృతం చేయాలని అనుకుంటున్నాం. భారత్‌తో మంచి భాగస్వామ్యం కలుగుతుందని మేం భావిస్తున్నాం. భారీ క్రీడా సంబరాలు నిర్వహించిన అనుభవం మాకుంది. గత ఒలింపిక్స్‌లోనూ మా అథ్లెట్లు అద్భుతాలు చేశారు. పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచాం. పెద్ద టోర్నీలను ఎలా నిర్వహించాలో భారత్‌కు తెలుసు. అయితే, ఒలింపిక్స్ వంటి మహా క్రీడాసంగ్రామం ఎన్నో విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. స్టేడియాల నిర్మాణం, మార్కెటింగ్, భద్రత, టికెట్ల అమ్మకం, అథ్లెట్లకు ఏర్పాట్లు.. ఇలా చాలా అంశాలు ప్రభావితం చేస్తాయి. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రీడా మైదానాన్ని ఆస్ట్రేలియా సంస్థ డిజైన్ చేసింది. ఒలింపిక్స్‌ను నిర్వహించడంలో పెద్ద ఇబ్బందేమీ ఉండదు" అని హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్ వెల్లడించారు.

**ఆస్ట్రేలియా అనుభవం ఇదీ..**

ఆస్ట్రేలియా ఇప్పటివరకు రెండుసార్లు ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చింది. మెల్‌బోర్న్ వేదికగా 1956లో, సిడ్నీలో 2000లో ఒలింపిక్స్ పోటీలు జరిగాయి. ఇప్పుడు మూడోసారి సిద్ధమవుతోంది. ఇక 1982, 2006, 2018లో కామన్వెల్త్ గేమ్స్‌ను నిర్వహించింది. ఈనేపథ్యంలో భారత్‌కు ఒలింపిక్స్ నిర్వహణ విషయంలో సహాయసహకారాలు అందించేందుకు మద్దతు తెలిపింది.